

అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో
నేడు అల్లూరి జయంతి వేడుకలు

కలెక్టరేట్: జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో గురువారం అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను నిర్వహించాలని కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు బుధవారం సర్క్యులర్‌ను కూడా జారీ చేశారు. గురువారం ఉదయం 9.30 గంటలకు కలెక్టరేట్ ఆడిటోరియంలో ఈ వేడుకలను నిర్వహిస్తున్నామని, కలెక్టరేట్ ప్రాంగణంలోని అధికారులందరూ హాజరుకావాలని ఆయన పేర్కొన్నారు.



ఆగని ఇసుక దందా

- ఏడు ర్యాంపుల్లో ఇష్టారాజ్యంగా తవ్వకాలు
- నేరుగా నదిలోకే వాహనాలు
- అధికారుల ఆదేశాలు బేఖాతరు
- రాత్రుళ్లు లోడింగ్.. తెల్లారేసరికి సరిహద్దులు దాటిస్తున్న వైనం

నరసన్నపేట, జూలై 3: కొత్త ప్రభుత్వం ఏర్పడినా నరసన్నపేట, శ్రీకాకుళం రూరల్ మండలాల్లో మాత్రం ఇసుక అక్రమ దందా ఆగడం లేదు. అక్రమ తవ్వకాలను నిరోధించాలని స్థానిక ప్రజాప్రతినిధుల ఆదేశాలతో అధికారులు హెచ్చరికలు జారీచేస్తున్నా ఇసుకాసురులు మాత్రం పట్టించుకోవడం లేదు. నరసన్నపేట మండలం మడపాం, బుచ్చిపేట, చేనులవలస, లుకాలం, శ్రీకాకుళం రూరల్ మండలం కరజాడ, బైరి, బట్టేరు తదితర ప్రాంతాల్లో రాత్రి సమయాల్లో ఇసుక అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. టిప్పర్‌కు రూ.20వేలు నుంచి రూ.25వేలు వసూళ్లు చేసి జాతీయ రహదారి ఎక్కించే బాధ్యతను ఈ ముఠా సభ్యులు తీసుకుంటున్నారు. జాతీయ రహదారిపై ఈ వాహనాలను ఎవరైనా అడ్డుకుంటే శ్రీకాకుళం రూరల్ మండలం వైసీపీ చెందిన ఇసుక వ్యాపారి పేరు చెబితే చాలు వాటిని పోలీసులు, సెబీ అధికారుల కూడా వదిలేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

దందా సాగుతుంది ఇలా..

- మడపాం, బుచ్చిపేట, చేనులవలస, లుకాలం గ్రామాలకు సాయంత్రం ఆరుగంటల సమయంలో ఒక్కొక్క లారీలు లేదా టిప్పర్లు చేరుకుంటాయి. వీటిని ఎవరికీ కనిపించకుండా జీడి తోటల్లో పార్కింగ్ చేస్తారు. రాత్రి 10 గంటలకు నేరుగా వంశధార నదిలోకి తీసుకువెళ్లి అక్కడే లోడింగ్ చేస్తారు. లుకలాం వద్ద రైల్వే వంతెన సమీపంలో భారీ యంత్రాలతో ఇసుక తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. గతంలో ఇసుక అక్రమ తవ్వకాలు చేసిన నాయకులతో పాటు స్థానికులు చేయికలిపి ఈ తంతు నిర్వహిస్తున్నారు.
- బుచ్చిపేట, చేనులవలస ఇసుక ర్యాంపుల నుంచి లోడింగ్ చేసిన వాహనాలకు ముగ్గురు వ్యక్తులు కారులో మడపాం టోల్‌ప్లాజా వరకు ఎస్కార్ట్‌గా వస్తారు. సింగుపురం వద్ద పోలీసులు గస్తీ లేదనే సమాచారం వస్తే.. మడపాం టోల్‌ప్లాజా నుంచి ఇసుక వాహనాలు బయల్దేరుతాయి. ఈ సమయంలో ఇసుక లారీలను అధికారులు నిలుపుదల చేస్తే లారీకి రూ.2వేల నుంచి రూ.5వేల వరకు ముడుపులు చెల్లించి ముందుకు వెళ్తున్నట్లు సమాచారం.
- మడపాం టోల్‌ప్లాజా, సర్వీసు రోడ్డు, బైరి వద్ద ఉన్న పెట్రోల్ బంకు పక్కన, ఆముదాలవలస, గార వెళ్లే మార్గంలో పగటి సమయంలో టిప్పర్లు, లారీలను ఉంచుతారు. రాత్రి సమయంలో ఒక్కొక్క ముఠా సభ్యుడు 20 నుంచి 30 లారీలను తీసుకువెళ్లి అర్ధరాత్రి సమయంలో ఇసుక తవ్వకాలు సాగిస్తున్నారు. ఈ లారీలు తెల్లవారు సమయానికే జిల్లా సరిహద్దులు దాటిపోతున్నాయి.



నరసన్నపేట మండలంలోని ఇసుక ర్యాంపు నుంచి వెళ్తున్న టిప్పర్‌ను పట్టుకున్న ఎస్ఈబీ అధికారులు

అధికారులు వస్తే గప్‌చుప్..

ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి సెబ్, స్థానిక పోలీసులకు ఇటీవల ఆదేశాలు జారీ చేశారు. దీంతో వారం రోజుల వరకు పోలీసులు రాత్రి సమయంలో ఇసుక ర్యాంపులపై దృష్టి సారించి తరువాత పట్టించుకోవడం మానేశారు. దీంతో మళ్లీ ఇసుక దందా ప్రారంభమైంది. అధికారుల కదిలికలపై నిఘా ఉంచిన ముఠా సభ్యులు వారు వస్తున్నట్లు తెలిస్తే గప్‌చుప్‌గా ర్యాంపుల్లో తవ్వకాలు నిలిపి వాహనాల లైట్లు ఆపివేస్తారు. అధికారులు వెళ్లిపోయిన తరువాత తవ్వకాలకు పూనుకుంటున్నారు. ఇలా ప్రతిరోజూ 50 నుంచి 70 లారీల ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారు. గత మూడు రోజులుగా లుకలాంలో ఇసుక అక్రమ తవ్వకాలు చేపడుతున్నట్లు వచ్చిన ఫిర్యాదుల మేరకు సెబ్ అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. అప్పటికే వాహనాలు వెళ్లిపోయినట్లు గుర్తించారు. జాతీయ రహదారిపై నరసన్నపేట వైపు వస్తున్న ఇసుక టిప్పర్‌ను గుర్తించి సీజ్ చేసి స్థానిక పోలీసులకు అప్పగించినట్లు సెబ్ ఎస్ఐ కావ్య తెలిపారు. నిరంతరం దాడులు చేపడుతున్నామని, హైవేపై వెళ్తున్న వాహనాలను కూడా తనిఖీ చేస్తున్నట్లు ఆమె చెప్పారు.

బడి బస్సు భద్రమేనా?

- జిల్లాలో 711 వాహనాలు ● ఫిట్‌నెస్ పొందినవి 542
- విద్యార్థుల రక్షణే కీలకం ● యాజమాన్యాలు, తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి

(టెక్కలి)

జిల్లాలో రణస్థలం, ఎచ్చెర్ల, శ్రీకాకుళం, గార, నరసన్నపేట, టెక్కలి, కోటబొమ్మాళి, పలాస, సోంపేట, ఇచ్ఛాపురం, ఆమదాలవలస, పాతపట్నం, కొత్తూరు ప్రాంతాల్లో ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు, ఇంటర్, డిగ్రీ, ఫార్మసీ, అగ్రికల్చర్, ఇంజనీరింగ్ కళాశాలలు ఎక్కువగా ఉన్నాయి. విద్యార్థుల కోసం ఆయా యాజమాన్యాలు 711 బస్సులు నడుపుతున్నాయి. కానీ, చాలా ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు బడి బస్సుల భద్రతను గాలికొదిలేస్తున్నాయి. కండీషన్ లేని వాహనాలను నడపడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో బడి బండి సురక్షితమో లేదో అధికారులు పరిశీలించి అనుమతులు మంజూరు చేయాల్సిన అవసరం ఉంది. విద్యార్థుల భద్రతే లక్ష్యంగా యాజమాన్యాలతో పాటు తల్లిదండ్రులూ జాగ్రత్త వహించాల్సి ఉంది. ప్రస్తుతం ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి, శ్రీకాకుళం ప్రాంతాల్లో సంబంధిత ఎంవీఐలు స్కూళ్ల బస్సుల ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. మొత్తం 711 బస్సులకు గాను 542 బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు ఇచ్చారు. మరో 169 బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. అయితే కొన్ని ప్రాంతాల్లో ఇంధనశకట తనిఖీ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. బస్సుల కండిషన్ బాగోలేకపోయినా ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు ఇస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీనివల్ల ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. నిబంధనల ప్రకారం ప్రతి మూడు నెలలకోసారి వెహికల్ ఇన్‌స్పెక్టర్ పాఠశాలలకు వెళ్లి బస్సుల సామర్థ్యం పరీక్షించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఇవీ నిబంధనలు..

- బస్సు ముందుభాగంలో ఎడమవైపున పాఠశాల/కళాశాల పేరు, ఫోన్ నంబర్ సహా పూర్తి చిరునామా స్పష్టంగా కనిపించేలా రాయాలి.
- విద్యాసంస్థ బస్సు డ్రైవర్ వయసు 60ఏళ్లకు మించరాదు. ప్రతి పాఠశాలలో డ్రైవర్ ఆరోగ్య పట్టికను నిర్వహించాలి. రక్తపోటు, మధుమేహం, కంటి పరీక్షలు వంటి ప్రాథమిక ఆరోగ్య పరీక్షలు ప్రతి మూడునెలలకో సారి యాజమాన్యాలు చేయించాలి.
- డ్రైవర్ ఫొటో, లైసెన్స్ వివరాలు అందరికీ తెలిసేలా బస్సు లోపల బోర్డును ఏర్పాటు చేయాలి.
- బాహ్య పరికరాలు, విండ్ స్క్రీన్, వైపర్స్ లైటింగ్, తదితర భాగాల పనితీరును తెలుసుకునేందుకు నెలకోసారి ప్రిన్సిపాల్, తల్లిదండ్రుల కమిటీ బస్సును తనిఖీ చేయాలి.

వివరాలను రిజిస్టర్‌లో నమోదుచేయాలి.

- ఫిర్యాదుల పుస్తకాలను ప్రతి వాహనంలో అందుబాటులో ఉంచాలి. ఫిర్యాదులను పరిశీలించి.. సమస్య పరిష్కరించాలి.



- పార్కింగ్ కోసం పాఠశాల/ కళాశాల ఆవరణలోనే స్థలం కేటాయించాలి.
- బస్సులో ప్రయాణిస్తున్న విద్యార్థుల వివరాల పట్టిక తప్పకుండా ఉండాలి. రూట్‌ప్లాన్ కూడా బస్సులో అందుబాటులో ఉంచాలి.
- విద్యార్థులు సులువుగా బస్సు ఎక్కేందుకు వీలుగా 325 మిల్లీమీటర్ల ఎత్తులో ఫుట్‌బోర్డు ఉండాలి. దీంతో చిన్నారులు ఎక్కి, దిగే సమయంలో ప్రమాదాలు జరగవు.
- ప్రతి బస్సుకు ఒక సహాయకుడు ఉండాలి.



కళాశాల బస్సును తనిఖీ చేస్తున్న టెక్కలి ఎంవీఐ సంజీవరావు

- విద్యార్థుల వివరాలు డ్రైవర్‌కు, సహాయకుడికి తప్పనిసరిగా తెలిసి ఉండాలి.
- బస్సు ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు విద్యార్థుల హాజరు తీసుకోవాలి.
- ప్రతి వాహనంలో అగ్నిప్రమాద నివారణ పరికరాలు తప్పనిసరిగా ఉంచాలి.
- తలుపులు ఉండడంతో పాటు అత్యవసర ద్వారం ఉండాలి.
- కిటికీలకు మధ్య ఇనుప గజాలను తప్పనిసరిగా అమర్చాలి.
- బస్సు బ్రేక్, స్టీరింగ్, టైర్లు కండీషన్‌లో ఉండాలి. స్పీడో మీటర్ పనిచేయాలి.
- సామర్థ్యానికి మించి విద్యార్థులను ఎక్కించరాదు.
- ప్రతినెలా బస్సు కండీషన్‌ను యాజమాన్యాలు, పేరెంట్స్ కమిటీ తనిఖీ చేయాలి.

ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకపోతే ఉపేక్షించం..

ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకుండా స్కూళ్లు, కళాశాలల బస్సులు రోడ్లపై తిరిగితే ఉపేక్షించేది లేదు. కచ్చితంగా ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందిన తరువాతే బస్సు నడపాలి. ఇప్పటికే టెక్కలి, పలాస, శ్రీకాకుళం పరిధిలో ఇంధనశకట తనిఖీ అధికారులు వాటిపై దృష్టిసారించారు. షెడ్యూల్ ప్రకారం ఉదయం, సాయంత్రం వేళల్లో తనిఖీలు చేపడుతున్నారు.

-చంద్రశేఖరరెడ్డి, ఉపరవాణాశాఖ అధికారి, శ్రీకాకుళం

నగరపాలక కమిషనర్‌గా ఓబులేసు

శ్రీకాకుళం అర్బన్, జూలై 3: శ్రీకాకుళం నగరపాలక సంస్థ కమిషనర్‌గా చల్లా ఓబులేసు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు కమిషనర్‌గా ఉన్న తమీమ్ అన్సారియా ప్రకాశం జిల్లా కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో ప్రస్తుతం సుడా వైస్ చైర్మన్‌గా విధులు నిర్వహిస్తున్న ఓబులేసును (ఎఫ్ఏసీ) పూర్తి అదనపు బాధ్యతలు చేపట్టాల్సిందిగా మంగళవారం రాత్రి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్నికలకు ముందు శ్రీకాకుళం నగరపాలక కమిషనర్‌గా ఓబులేసు పని చేశారు. మరోసారి కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన ఓబులేసును సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరాభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. యుద్ధ ప్రాతిపదికన కాలువల్లో పూడిక తీత పనులు జరుగుతున్నాయని, వాటి వ్యర్థాలను తరలించి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూస్తామని చెప్పారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న ఓబులేసు

అవగాహన కోసం కాదు..
బటన్ నొక్కినప్పుడు చూడటానికే!

- రైతు భరోసా కేంద్రాల్లో టీవీల కోసం నిధుల ఖర్చు
- సాగుపై అవగాహన కల్పిస్తామని చెప్పి..
- జగన్ కోసం ప్రచారం చేసుకున్న వైసీపీ సర్కారు

మెళియాపుట్టి, జూలై 3: రైతులకు సాగులో నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించాలన్న లక్ష్యంతో గత ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల్లో టీవీలను ఏర్పాటు చేసింది. వీటికి నెట్ సదుపాయం కల్పించింది. అయితే, ఈ టీవీలతో రైతులకు ఎలాంటి ప్రయోజనం కలగలేదు. కేవలం వైసీపీ ప్రచారానికే అవి ఉపయోగపడ్డాయనే విమర్శలు ఉన్నాయి. సాగులో నూతన పద్ధతులు, కొత్త వంగడాలు, యాంత్రీకరణ తదితర అంశాలను టీవీల్లో ప్రసారం చేసి రైతులకు అవగాహన కల్పించాల్సి ఉంది. కానీ అధికారులు మాత్రం అప్పటి సీఎం జగన్ ప్రచారాలు, బటన్ నొక్కుడు కార్యక్రమాలను మాత్రమే టీవీల్లో చూపించేవారు. దీంతో రైతులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించాలన్న లక్ష్యం నీరుగారింది. ఉమ్మడి జిల్లాలో 656 రైతు భరోసా కేంద్రాలను వైసీపీ సర్కారు ఏర్పాటు చేసింది. ఇందులో 110 కేంద్రాలు అద్దె భవనాల్లో నడుస్తోన్నాయి. ప్రతీ ఆర్‌బీకేలో రూ.42 వేలతో ఒక టీవీని కొనుగోలు చేసి ఏర్పాటు చేశారు. మొత్తం 656 టీవీల కొనుగోలుకు రూ.2.75కోట్లకు పైగా ఖర్చు చేశారు. దీంతో పాటు ఒక్కొక్క కేంద్రానికి రూ.15 వేలు చొప్పున ఖర్చు చేసి నెట్ సౌకర్యం కల్పించారు. ఏడాదికి నెట్ బిల్లు రూ.1,24,960 చెల్లించేవారు. అలాగే, సీజన్‌ల వారీగా విత్తనాలు నాటడం నుంచి పంట కోత వరకు అవగాహన కల్పించేందుకు డిజిటల్ లైబ్రరీకి సంబంధించిన సమాచారంతో పెన్‌డ్రైవ్‌లు కూడా ఇచ్చారు. వీటి ద్వారా రైతులకు పంటల ఉత్పత్తి, దిగుబడులపై అవగాహన, పంటలకు ఆశించే తెగుళ్లపై వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు నిర్వహించే ముఖాముఖి కార్యక్రమాలు, సభలను ప్రసారం చేయాలి. కానీ, ఇవేమీ టీవీల్లో చూపించలేదు. ఎంతసేపూ జగన్ రైతులకు అద్భుత పరిపాలన అందించినట్లు చూపించేవారు. రైతు భరోసా, పంట నష్టపరిహారం, బీమా వంటి కార్యక్రమాలకు జగన్ బటన్ నొక్కి నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రసారం చేసేవారు. వైసీపీ కార్యక్రమాలు తప్ప ఒక్కరోజు కూడా వ్యవసాయానికి సంబంధించిన సూచనలు, సలహాలు ఇవ్వలేదు. ఈ టీవీలతో నిధులు వృథా తప్ప తమకు ఎలాంటి ప్రయోజనం చేకూరలేదని రైతులు చెబుతున్నారు.



మెళియాపుట్టి రైతుభరోసా కేంద్రంలో ఏర్పాటు చేసిన టీవీ

లోడింగ్.. అన్‌లోడింగ్ అక్కడే

- వంతెన కిందనే కానిచ్చేస్తున్న వ్యాపారులు
- అక్కడే భారీ వాహనాలు, కార్లు పార్కింగ్ ● తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలు

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

నగరంలోకి ప్రవేశించే సింహద్వారం జంక్షన్ వద్ద భారీ వంతెన ఉంది. విశాఖ వైపు నుంచి వచ్చే వాహనాలు శ్రీకాకుళంలోకి ప్రవేశించాలంటే దాని కిందే రావాలి. నిబంధనల ప్రకారం ఆ వంతెన కింద వాహనాలను పార్కింగ్ చేయకూడదు. ఇక్కడ ప్రమాదాలు సంభవించ కుండా, ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా పోలీసులు నిఘా పెట్టాల్సి ఉంది. కానీ ఆ నిబంధనలు అమలు కావడం లేదు. వంతెన పిల్లర్లకు ఆనుకుని భారీ వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. కొందరు వ్యాపారులు అక్కడే చిన్న వాహనాల్లోకి సరుకులను లోడింగ్, అన్‌లోడింగ్ చేస్తున్నారు మరోపక్క కార్లు, మోటారు బైక్‌లను కూడా అక్కడే పార్కింగ్ చేస్తున్నారు. మధ్యలో మాత్రమే వాహనాల రాకపోకలకు వీలుగా ఉంది. వంతెనకు ఆవల కాలువపై ఉన్న ఫుట్‌పాత్‌పై కూడా కార్లు ఇష్టానుసారంగా నిలిపివేస్తున్నారు. ఇక్కడ బందోబస్తు నిర్వహించే ట్రాఫిక్ పోలీసులు మాత్రం నోరుమెదపరన్న విమర్శలు ఉన్నాయి. రోజూ ఈ వంతెన కింద నుంచే జిల్లాకు చెందిన కీలక అధికారులు రాకపోకలు సాగిస్తుంటారు. వారు కూడా ఈ విషయాన్ని చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు.



రోడ్డుపై ర్యాంపు ఏర్పాటు చేసి లారీ నుంచి సరుకులు దించుతున్న దృశ్యం



వంతెన కింద మరోవైపున కార్లు, లారీలను పార్కింగ్ చేసిన దృశ్యం

ఐబీపీఎస్ క్లర్క్ ఎగ్జామ్ 2024

ముఖ్యమైన పది అంశాలు



విविధ ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఖాళీగా ఉన్న 6,128 క్లర్క్ పోస్టుల భర్తీకి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలెక్షన్(ఐబీపీఎస్) నోటిఫికేషన్ విడుదల చేసింది. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ మొదలైంది. అర్హులైన అభ్యర్థులు జూలై 21లోపు దరఖాస్తు చేసుకోవాలి. ఈ ప్రక్రియలో ఏయే బ్యాంకులు పాల్గొంటున్నాయి. ఎలా దరఖాస్తు చేసుకోవాలి? దరఖాస్తు చేసే ముందు ఏయే అంశాలను గమనంలోకి తీసుకోవాలి? పరీక్ష విధానం ఎలా ఉంటుంది? ఆఫర్ లెటర్ అందుకున్న తరవాత ఉద్యోగంలో చేరబోయే ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏమిటి? వివరాలు చూద్దాం..!

1. ఈ భర్తీ ప్రక్రియలో దేశవ్యాప్తంగా మొత్తం 11 ప్రభుత్వ రంగ బ్యాంకులు పాల్గొంటున్నాయి.
2. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఏదైనా బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. వయసు 20 నుంచి 28 ఏళ్ల మధ్య ఉండాలి. అంటే 1996 జూలై 1కి ముందు గానీ, 2004 జూలై 1 తరవాత గానీ జన్మించి ఉండకూడదు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం గరిష్ఠ వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
3. అభ్యర్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరి. కంప్యూటర్ ఆపరేషన్స్/లాంగ్వేజ్‌లో సర్టిఫికెట్/డిప్లొమా/డిగ్రీ కోర్సు చేసి ఉండాలి లేదా హైస్కూల్/కాలేజీ స్థాయిలో కంప్యూటర్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఒక సబ్జెక్టుగా చదివి ఉండాలి. అభ్యర్థులకు తాము దరఖాస్తు చేస్తున్న ప్రాంతానికి సంబంధించిన అధికార భాషలో తగిన ప్రావీణ్యం ఉండాలి.
4. పైన పేర్కొన్న అన్ని అర్హతలతో పాటు తప్పనిసరిగా ఉండాల్సిన మరో అర్హత హెల్తీ క్రెడిట్ హిస్టరీ(మంచి రుణ చరిత్ర). ఎంపికైన అభ్యర్థులు ఉద్యోగాల్లో చేరే ముందు సంబంధిత బ్యాంకులు తప్పనిసరిగా క్రెడిట్ హిస్టరీ చెక్ చేస్తాయి. కాబట్టి అభ్యర్థులు సిబిల్ స్టేటస్‌ను అప్‌డేట్ చేసుకోవాలి. ఒకవేళ సిబిల్ స్కోరు అప్‌డేట్ కాని పక్షంలో... ఇంతకు ముందే ఏదైనా బ్యాంకు/సంస్థ నుంచి రుణం తీసుకుని చెల్లించిన అభ్యర్థులు.. సదరు బ్యాంక్/సంస్థ నుంచి నో ఆబ్జెక్షన్ సర్టిఫికెట్(ఎన్‌వోసీ)ని తీసుకోవాలి. అలా చేయని పక్షంలో ఇచ్చిన ఆఫర్ లెటర్‌ను బ్యాంక్ క్యాన్సిల్ చేసే ప్రమాదం ఉంటుంది.
5. ఇక పరీక్ష విషయానికొస్తే...ఐబీపీఎస్ క్లర్క్ ప్రిలిమ్స్ ఎగ్జామ్‌ని 100 మార్కులకు నిర్వహిస్తారు. ప్రశ్న పత్రంలో 100 ప్రశ్నలు ఉంటాయి. పరీక్ష వ్యవధి 60 నిమిషాలు. ప్రశ్న పత్రంలో మూడు విభాగాలు ఉంటాయి.

విభాగం	ప్రశ్నలు	మార్కులు	సమయం
ఇంగ్లీష్ లాంగ్వేజ్	30	30	20 నిమిషాలు
న్యూమరికల్ ఎబిలిటీ	35	35	20 నిమిషాలు
రీజనింగ్ ఎబిలిటీ	35	35	20 నిమిషాలు
మొత్తం	**100**	**100**	**60 నిమిషాలు**

6. అభ్యర్థులు ప్రతి సెక్షన్‌లోనూ ఐబీపీఎస్ నిర్దేశించిన కటాఫ్ మార్కుల మేరకు అర్హత సాధించాల్సి ఉంటుంది. ప్రిలిమ్స్ సాధించిన మెరిట్ మేరకు ఆన్‌లైన్ మెయిన్స్ పరీక్షకు అభ్యర్థులను ఐబీపీఎస్ షార్ట్‌లిస్ట్ చేస్తుంది.
7. మెయిన్స్ పరీక్షను 200 మార్కులకు నిర్వహిస్తారు. మొత్తం 190 ప్రశ్నలు ఉంటాయి. పరీక్ష వ్యవధి 160 నిమిషాలు. ప్రశ్న పత్రంలో నాలుగు విభాగాలు ఉంటాయి.

విభాగం	ప్రశ్నలు	మార్కులు
జనరల్/ఫైనాన్షియల్ అవేర్‌నెస్	50	50
జనరల్ ఇంగ్లీష్	40	40
రీజనింగ్ ఎబిలిటీ అండ్ కంప్యూటర్ అప్టిట్యూడ్	50	50
క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్	50	60

8. మొదటి రెండు విభాగాల్లో ప్రతి విభాగానికి 35 నిమిషాలు, తరవాత రెండు విభాగాల్లో ప్రతి దానికి 45 నిమిషాల సమయాన్ని ఐబీపీఎస్ నిర్దేశించింది. ఒక వేళ ఏమైనా మార్పులు చేర్పులు ఉన్నట్లయితే ఐబీపీఎస్ ఆ సమాచారాన్ని తన వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతుంది. కాబట్టి అభ్యర్థులు తరచుగా ఐబీపీఎస్ వెబ్‌సైట్‌ను చెక్ చేస్తూ ఉండాలి. ఇక పరీక్ష విధానానికి సంబంధించిన పూర్తి సమాచారంతో కూడిన ఇన్ఫర్మేషన్ హ్యాండ్ అవుట్‌ను ఐబీపీఎస్ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.
9. ఇక్కడ అభ్యర్థులు గమనించాల్సిన మరో ముఖ్య విషయం ఏమిటంటే.. నెగెటివ్ మార్కింగ్ విధానాన్ని ఐబీపీఎస్ అమలు చేస్తుంది. తప్పుగా గుర్తించిన ప్రతి సమాధానానికి నాలుగో వంతు(0.25) మార్క్ కట్ చేస్తుంది. ఒకవేళ అభ్యర్థి సమాధానం గుర్తించకుండా ఖాళీగా వదిలిపెడితే మార్కుల్లో ఎలాంటి కోత ఉండదు
10. అభ్యర్థులు ఐబీపీఎస్ నిర్దేశించిన కనీస మార్కులు(కటాఫ్) తప్పనిసరిగా సాధించాలి. అయితే ఈ కటాఫ్ మార్కులను రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఆ సమయానికి బ్యాంకుల్లో ఉన్న ఖాళీల సంఖ్యను బట్టి ఐబీపీఎస్ నిర్దేశిస్తుంది. ప్రొవిజనల్ అలాట్‌మెంట్ ప్రాసెస్ పూర్తయ్యే వరకూ మెయిన్స్ మార్కులను ఐబీపీఎస్ వెల్లడించదు.

ఖాళీలు ఉన్న బ్యాంకులు

- బ్యాంక్ ఆఫ్ బరోడా
- కెనరా బ్యాంక్
- ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్
- యూకో బ్యాంక్
- బ్యాంక్ ఆఫ్ ఇండియా
- సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
- పంజాబ్ నేషనల్ బ్యాంక్
- యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
- బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర
- ఇండియన్ బ్యాంక్
- పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్

మొత్తం ఖాళీలు: **6,128**
ఆంధ్రప్రదేశ్‌లో: **105**, తెలంగాణలో: **104**
తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:
తెలంగాణ: హైదరాబాద్, సికింద్రాబాద్, కరీంనగర్.
ఆంధ్రప్రదేశ్: గుంటూరు, విజయవాడ, కర్నూలు, విశాఖపట్నం.

Institute of Banking Personnel Selection

దిక్సూచి
DIKSUCHI

నోయిడాలోని హిందుస్థాన్ కంప్యూటర్స్ లిమిటెడ్(హెచ్‌సీఎల్) టెక్నాలజీస్ - 'టెక్‌బీ' ఎర్లీ కెరీర్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. అభ్యర్థులు ఐటీ ఉద్యోగులుగా రాణించేందుకు, అసోసియేట్స్‌గా ఎదిగేందుకు ఈ ప్రోగ్రామ్ తోడ్పడుతుంది. సంస్థ నిర్వహించే కెరీర్ ఆప్టిట్యూడ్ టెస్ట్(హెచ్‌సీఎల్ క్యాట్), వర్సంట్ టెస్ట్, ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. హైదరాబాద్, విజయవాడ సహా నోయిడా, లఖ్‌నవూ, నాగ్‌పూర్, చెన్నైలలో శిక్షణ కేంద్రాలు ఉన్నాయి. ఇంటర్న్‌షిప్ సమయంలో నెలకు రూ.10,000ల స్టయిపెండ్ ఇస్తారు. శిక్షణ పూర్తయిన అభ్యర్థులకు సంస్థలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్/డిజైన్ ఇంజనీర్‌గా ఉద్యోగావకాశం కల్పిస్తారు. ఆసక్తిగలవారు ఉద్యోగం చేస్తూనే బిట్స్ పిలానీ, ఐఐఐటీ కొట్టాయం, అమిటి యూనివర్సిటీ(ఆన్‌లైన్), కేఎల్ యూనివర్సిటీ, శస్త్ర యూనివర్సిటీలలో చదువుకునే అవకాశం ఉంది. సంబంధిత గ్రాడ్యుయేషన్ కోర్సులకయ్యే ఖర్చును నిబంధనల ప్రకారం సంస్థ భరిస్తుంది.

హెచ్‌సీఎల్ టెక్నాలజీస్‌లో టెక్‌బీ ప్రోగ్రామ్



విభాగాలు: డెవలప్ అప్లికేషన్స్, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, కోడింగ్, టెస్టింగ్ ఇంజనీర్, అనలిస్ట్, ప్రొడక్ట్ అండ్ అప్లికేషన్, డిటెక్టింగ్ బగ్స్ అండ్ రన్నింగ్ డయాగ్నస్టిక్స్ ఆఫ్ సాఫ్ట్‌వేర్ అప్లికేషన్స్, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్, డిజైన్ ఇంజనీర్, ప్రొడక్ట్ అండ్ అప్లికేషన్ డిజైన్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మేనేజ్‌మెంట్, వెబ్ సర్వర్ డెప్లాయ్‌మెంట్, ప్రాసెస్ ఆటోమేషన్, సెక్యూరిటీ పాలసీ ఇంప్లిమెంటేషన్

ప్రోగ్రామ్ వివరాలు: దీనిని హైబ్రిడ్(ఆన్‌లైన్ సెషన్స్, తరగతి గది బోధన) విధానంలో నిర్వహిస్తారు. ఇందులో మొదట ఐటీ ఫౌండేషన్ అంశాలు బోధిస్తారు. ఐటీ ఫండమెంటల్స్, ఐటీ ప్రొఫెషనల్స్‌కు అవసరమయ్యే అంశాలు వివరిస్తారు. తరవాత ట్రెయినింగ్ ఫర్ జాబ్ సెషన్స్ ఉంటాయి. ఇందులో జాబ్ బేస్డ్ లెర్నింగ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, సిమ్యులేషన్స్, కేస్ బేస్డ్ ప్రాక్టికల్ కరిక్యులమ్, పీర్ బేస్డ్ డిస్కషన్స్, లైఫ్ కోచెస్ టూల్స్ తదితర అంశాల్లో శిక్షణ ఇస్తారు. సంస్థకు చెందిన గ్లోబల్ ప్రాజెక్ట్‌లలో ఇంటర్న్‌షిప్ పూర్తిచేయాల్సి ఉంటుంది. ప్రోగ్రామ్‌కు సంబంధించిన స్టడీ మెటీరియల్‌ను సంస్థ అందిస్తుంది. అభ్యర్థులు సమయానుసారం అసెస్‌మెంట్‌లు, అసైన్‌మెంట్‌లు సబ్మిట్ చేయాలి.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి కనీసం 75 శాతం మార్కులతో ఇంటర్/పన్నెండో తరగతి /తత్సమాన పరీక్ష (2023/2024) ఉత్తీర్ణులైనవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఐటీ విభాగాలకు మేథమెటిక్స్/బిజినెస్ మేథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా చదివి ఉండాలి. ఇందులో కనీసం 60 శాతం మార్కులు తప్పనిసరి. ఐఐటీ జేఈఈ మెయిన్ 2023లో కనీసం 80 పర్సంటైల్ సాధించిన అభ్యర్థులు హెచ్‌సీఎల్ కెరీర్ ఆప్టిట్యూడ్ టెస్ట్(హెచ్‌సీఎల్ క్యాట్) రాయనవసరం లేదు. వీరిని నేరుగా వర్సంట్ టెస్ట్, ఇంటర్వ్యూలకు అనుమతిస్తారు.

ఎంపిక ప్రక్రియ: అభ్యర్థులు ముందుగా కెరీర్ ఆప్టిట్యూడ్ టెస్ట్(హెచ్‌సీఎల్ క్యాట్) రాయాల్సి ఉంటుంది. దీనిని ఆన్‌లైన్ మోడ్‌లో నిర్వహిస్తారు. ఇందులో క్వాంటిటేటివ్ రీజనింగ్(మేథమెటిక్స్), లాజికల్ రీజనింగ్ సంబంధిత ప్రశ్నలు అడుగుతారు. ఇంటర్ స్థాయిలో ప్రశ్నలు ఉంటాయి. ఇందులో అర్హత సాధించిన అభ్యర్థులను వర్సంట్ టెస్ట్‌కు పిలుస్తారు. ఇందులో స్పోకెన్ ఇంగ్లీష్, లాంగ్వేజ్ స్కిల్స్ పరీక్షిస్తారు. తరవాత ఫేస్ టు ఫేస్ ఇంటరాక్షన్ విధానంలో ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులను ఎంపిక చేస్తారు.

ఉన్నత విద్యావకాశాలు: హెచ్‌సీఎల్ టెక్‌బీ ప్రోగ్రామ్ పూర్తి చేసిన అభ్యర్థులు ఉద్యోగంలో చేరిన తరవాత ఆసక్తి మేరకు పై చదువులు చదువుకోవచ్చు. శస్త్ర యూనివర్సిటీలో మూడేళ్ల బీసీఏ, రెండేళ్ల ఎంసీఏ/ఎమ్మెస్సీ డేటా సైన్స్; బిట్స్ పిలానీలో నాలుగేళ్ల బీఎస్సీ(డిజైన్ అండ్ కంప్యూటింగ్), వర్క్ ఇంటిగ్రేటెడ్ లెర్నింగ్ ప్రోగ్రామ్‌లు(బీటెక్, ఎంటెక్, బీఎస్సీ, ఎమ్మెస్సీ); అమిటి యూనివర్సిటీ(ఆన్‌లైన్)లో మూడేళ్ల వ్యవధి గల బీకాం/బీసీఏ/బీబీఏ/బీఎస్సీ, రెండేళ్ల ఎంబీఏ/ఎంసీఏ; కేఎల్ యూనివర్సిటీలో మూడేళ్ల బీసీఏ; ఐఐఐటీ కొట్టాయంలో ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎంటెక్ కోర్సుల్లో చేరవచ్చు.

- దరఖాస్తు ఫీజు లేదు
- **వెబ్‌సైట్:** hcltechbee.com

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/DurXispలో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి

ట్రయాంగిల్ క్రైమ్ ఎంటర్‌టైనర్



ఎఫ్ 2, ఎఫ్ 3 చిత్రాల సూపర్ హిట్ కాంబో విక్టరీ వెంకటేశ్, దర్శకుడు అనిల్ రావిపూడి, దిల్ రాజు హ్యాట్రిక్ ఇవ్వడం కోసం మళ్లీ చేతులు కలిపారు. దిల్ రాజు సమర్పణలో శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బేనరుపై శిరీష్ నిర్మించే ఈ చిత్రం షూటింగ్ బుధవారం రామానాయుడు స్టూడియోలో ప్రారంభమైంది. వెంకటేశ్, మీనాక్షి చౌదరిపై చిత్రీకరించిన ముహూర్తపు షాట్‌కు నిర్మాత సురేశ్‌బాబు కెమెరా స్విచ్ ఆన్ చేయగా, మరో నిర్మాత అల్లు అరవింద్ తొలి క్లాప్ ఇచ్చారు. సీనియర్ దర్శకుడు రాఘవేంద్రరావు గౌరవ దర్శకత్వం వహించారు. మరో దర్శకుడు వంశీ పైడిపల్లి స్ర్కిప్ట్ అందజేశారు. హీరో, అతని మాజీ ప్రేయసి, భార్య.. ఈ మూడు పాత్రల మధ్య తిరిగే ట్రయాంగిల్ క్రైమ్ ఎంటర్‌టైనర్ ఇదని దర్శకనిర్మాతలు చెప్పారు. ఈ సినిమాలో వెంకటేశ్ సరసన మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేశ్ నటిస్తున్నారు. ఉపేంద్ర లిమాయే. రాజేంద్రప్రసాద్, సాయికుమార్, నరేశ్, వి.టి. గణేశ్, మురళీధర్ గౌడ్, పమ్మి సాయి, ఆనంద్‌రాజ్, చైతన్య జొన్నలగడ్డ, మహేశ్ బాలరాజ్ ఇతర ముఖ్య తారాగణం. ఈ చిత్రానికి సంగీతం: భీమ్స్ సిసిరోలియో, ఫొటోగ్రఫీ: సమీర్ రెడ్డి, ఎడిటింగ్: తమ్మిరాజు, సహ రచయితలు: ఎస్.కృష్ణ, జి.ఆదినారాయణ.

చౌకీదార్ చిత్రీకరణ మొదలు



పృథ్వీ అంబర్ కథానాయకుడిగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'చౌకీదార్' చిత్రీకరణ బుధవారం ప్రారంభమైంది. బెంగళూరులోని బండే మహంకాళి ఆలయంలో పూజా కార్యక్రమాలతో చిత్రీకరణ ప్రారంభించారు. నిర్మాత కల్లహళ్లి చంద్రశేఖర్ క్లాప్ ఇచ్చారు. కీలకపాత్ర పోషిస్తున్న సాయికుమార్ కెమెరా స్విచ్చాన్ చేశారు. ఈ చిత్రంలో ధన్యా రామ్‌కుమార్ కథానాయికగా నటిస్తున్నారు. చంద్రశేఖర్ బండియప్ప దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఈ చిత్రంలో పృథ్వీ యాక్షన్ రోల్ చేస్తున్నారు. ఆయన పాత్ర కొత్త తరహాలో ఉండబోతోంది. తన పాత్రలో వైవిధ్యం చూపేందుకు ఆయన చాలా కష్టపడుతున్నారు. పృథ్వీ అంబర్ మాట్లాడుతూ 'ఒక్క రోజులో టీజర్‌ను చిత్రీకరించాం. చాలా సరదాగా అనిపించింది. ఈ చిత్రంలో చాలా జీవిత అనుభవాలు ఉన్నాయి. మంచి ఫ్యామిలీ ఎలిమెంట్స్ కథలో ఉన్నాయి' అన్నారు. సాయికుమార్ మాట్లాడుతూ 'నాకు చాలా సంతోషంగా ఉంది. వచ్చే ఏడాది 50 ఏళ్లు పూర్తవుతున్నాయి. చౌకీదార్ కథ ఎమోషనల్ డ్రామా. ఇది చాలా మంచి సబ్జెక్ట్' అన్నారు. 'ఇది చక్కని ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. షూటింగ్ త్వరలో ప్రారంభమౌతుంది. పలు భాషల్లో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నామని నిర్మాత చెప్పారు. సచిన్ బస్రూర్ సంగీతాన్ని అందిస్తున్నారు.

లేడీ క్యారెక్టర్‌లో విశ్వక్‌సేన్

సినిమా సినిమాకు వైవిధ్యమైన కథాంశాలను ఎంచుకుని మెప్పిస్తున్న విష్వక్‌సేన్.. లేడీ క్యారెక్టర్‌లో కనిపించనున్న చిత్రం 'లైలా'. అయితే ఇందులో ఆయన సినిమా మొత్తం ఇదే గెటప్‌లో ఉంటారా.. కేవలం కొద్ది సేపు మాత్రమే ఈ లుక్‌లో కనిపిస్తారా అనేది సినిమా రిలీజ్ అయ్యేవరకు వేచి చూడాల్సిందే. ఫస్ట్ లుక్‌తోనే విపరీతమైన బజ్‌ను క్రియేట్ చేసిన ఈ 'లైలా' క్యారెక్టర్



థియేటర్లలోకి వచ్చాక ఎలాంటి సంచలనాలు సృష్టిస్తుందో అని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ రొమాంటిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌కు రామ్‌నారాయణ్ దర్శకత్వం వహిస్తున్నారు, సాహు గారపాటి నిర్మిస్తున్నారు. బుధవారం ఈ సినిమాని ప్రారంభించి ఇందులో విష్వక్‌సేన్ పోషించే 'లైలా' 'ఐ' లుక్‌ను విడుదల చేశారు. ముహూర్తపు సన్నివేశానికి దర్శకుడు కె. రాఘవేంద్రరావు క్లాప్ ఇవ్వగా, దర్శకుడు హరీశ్ శంకర్ కెమెరా స్విచ్చాన్ చేశారు. వెంకట సతీశ్‌కిలారు, జెమిని కిరణ్ స్ర్కిప్ట్‌ను అందించారు. ఈ సినిమాలో కథానాయికగా ఆకాంక్ష శర్మ నటిస్తోంది. ఈ చిత్రానికి ఎడిటర్: అన్వర్ అలీ, డీఓపీ: రిచర్డ్ ప్రసాద్, సంగీతం: జిబ్రాన్.

ఆగస్టులో సెట్స్‌పైకి



'కల్కి 2898 ఏడీ' చిత్రం సూపర్‌హిట్ అయిన ఆనందంలో ఉన్న ప్రభాస్ అభిమానులకు మరో తీపి కబురు. ఆయన కథానాయకుడిగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తెరకెక్కిన 'సలార్' ఫ్రాంచైజీలో వస్తున్న 'సలార్ 2' చిత్రం సెట్స్ పైకి వెళ్లేందుకు సిద్ధమైందని సమాచారం. ఆగస్టు 10 నుంచి ప్రశాంత్ నీల్ చిత్రీకరణ కొనసాగించేందుకు సన్నాహాలు చేస్తున్నారట. 15 రోజుల పాటు సాగే ఈ షెడ్యూల్‌లో ప్రభాస్, పృథ్వీరాజ్‌పై భారీ యాక్షన్ సీక్వెన్స్‌ను తెరకెక్కించనున్నారని తెలుస్తోంది. 'కల్కి 2898 ఏడీ' విడుదలవ్వడంతో ప్రభాస్ కూడా 'సలార్ 2' పై దృష్టి పెట్టనున్నారు. ఈ చిత్రం 2025లో ప్రేక్షకుల ముందుకు రానుంది. 'సలార్' తొలి భాగం సూపర్ హిట్‌గా నిలిచిన విషయం తెలిసిందే. మేకర్స్ ఈ చిత్రానికి కొనసాగింపుగా 'సలార్: శౌర్యాంగపర్వ' పేరుతో రెండో భాగాన్ని ప్రకటించారు. అయితే తొలిభాగాన్ని తెరకెక్కించే సమయంలోనే రెండో భాగానికి సంబంధించి దాదాపు 20 శాతం చిత్రీకరణ పూర్తి చేసినట్లు తెలుస్తోంది. శ్రుతీహాసన్ కథానాయికగా నటిస్తుండగా, హోంబలే ఫిల్మ్స్ నిర్మిస్తోంది.

సైకో స్టోరీ



రక్షిత్ అట్లూరి హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'ఆపరేషన్ రావణ్'. న్యూ ఏజ్ సస్పెన్స్ థ్రిల్లర్‌గా దర్శకుడు వెంకట సత్య తెలుగు, తమిళ భాషల్లో రూపొందిస్తున్నారు. రాధిక శరత్‌కుమార్ ఓ ముఖ్య పాత్ర పోషిస్తున్న ఈ చిత్రాన్ని ధ్యాన్ అట్లూరి నిర్మిస్తున్నారు. సంగీర్తన విపిన్ హీరోయిన్. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని ఆగస్టు 2న విడుదల చేయనున్నట్లు నిర్మాత ప్రకటించారు. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్ పై 'ఎ సైకో స్టోరీ' అని క్యాప్షన్ పెట్టారు. యాక్షన్ సీక్వెన్స్‌లోని హీరో రక్షిత్ స్టిల్‌తో డిజైన్ చేసిన ఈ పోస్టర్ ఆసక్తికరంగా ఉంది. ఈ చిత్ర విజయంపై యూనిట్ కాన్ఫిడెంట్‌గా ఉంది. చరణ్‌రాజ్, కాంచి, రాకెట్ రాఘవ, రఘు కుంచె, విద్యాసాగర్, టీవీ 5 మూర్తి, కార్తీక్ తదితరులు నటించిన ఈ చిత్రానికి మాటలు: లక్ష్మీ లోహిత్ పూజారి, సంగీతం: శరవణ వాసుదేవన్, ఫొటోగ్రఫీ: నాని చమిడిశెట్టి, ఎడిటింగ్: సత్య గిద్దుటూరి , ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: శ్రీపాల్ చొల్లేటి.

తెలుగు అభిమానుల్ని మిస్ అవుతున్నా



నటి రకుల్ ప్రీత్ సింగ్ 'భారతీయుడు 2' చిత్రంతో ప్రేక్షకులను పలకరించడానికి సిద్ధమయ్యారు. 12న విడుదలవుతున్న ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఇన్‌స్టాగ్రామ్‌లో 'ఆస్క్ మీ ఎనీథింగ్' సెషన్ నిర్వహించారు. ఇందులో అభిమానులతో పలు విషయాలను ఆమె షేర్ చేసుకున్నారు.

'టాప్ డైరెక్టర్ శంకర్ సినిమాలో నటించడం నా అదృష్టం. ఆయనతో పనిచేయాలనే కోరిక ఈ సినిమాతో నెరవేరింది. ఈ సినిమా విడుదల కోసం చాలా ఆతృతగా ఎదురుచూస్తున్నాను. ఆయన తెరపై సృష్టించే క్యారెక్టర్స్ అద్భుతంగా ఉంటాయి. సెట్‌లో ఆయన ఆలోచనలు, దర్శకత్వ పటిమను చూసి ఆశ్చర్యపోయేదాన్ని. ఈ సినిమా షూటింగ్ సమయంలో ఆయన నుంచి ఎన్నో విషయాలు నేర్చుకున్నాను. తెలుగులో నటించి చాలా కాలమైంది. తెలుగు అభిమానుల్ని మిస్ అవుతున్నా. ప్రస్తుతం తెలుగులో సినిమా చేయడానికే కొన్ని కథలు వింటున్నా. నచ్చిన స్ర్కిప్ట్ దొరగ్గానే నటిస్తాను" అని చెప్పారు.

ఇది మనందరి కథ



నివేద థామస్, ప్రియదర్శి, విశ్వదేవ్, గౌతమి, భాగ్యరాజా ప్రధాన పాత్రలు పోషించిన చిత్రం '35 చిన్న కథ కాదు'. విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే కథ ఇది. హృదయాలను కదిలించే భావోద్వేగాలతో దర్శకుడు నందకిశోర్ ఈ సినిమాను రూపొందించారు. ఆగస్టు 15న ఈ చిత్రం విడుదలవుతున్న సందర్భంగా బుధవారం టీజర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నిర్మాతల్లో ఒకరైన రానా దగ్గుబాటి మాట్లాడుతూ 'నందు ఈ కథ చెప్పినప్పుడు నాకు నేను గుర్తుకు వచ్చాను. నా కోసం అమ్మ పడిన కష్టం స్ఫురణకు వచ్చింది. ఇది మన అందరి కథ. చాలా మంది లైఫ్ ఇలాగే ఉంటుంది. కమర్షియల్ సినిమాలు చాలా వస్తుంటాయి కానీ ఇటువంటి చిత్రాలు చాలా అరుదు. నివేదకి కథ నచ్చితే ఆ కథతోనే ఉంటుంది. సినిమా బాగా రావడానికి ఎంతో సపోర్ట్ చేస్తుంది. అందరికీ కనెక్ట్ అయ్యే సినిమా ఇది' అన్నారు. 'నా కెరీర్‌లో బెస్ట్ అంతా రామానాయుడు స్టూడియోలోనే జరిగింది. ఇండస్ట్రీకి వచ్చిన తర్వాత నాకు రానా మొదట పరిచయమయ్యారు. నా కెరీర్‌లో చాలా స్పెషల్ ఫిల్మ్ '35.. చిన్న కథ కాదు'. ఇందులో మదర్ రోల్ పోషించా. ఇంతవరకూ నేను చేసిన పాత్రలకు చాలా భిన్నమైంది' అన్నారు. మనసును కదలించే సినిమా ఇదని నటుడు విశ్వదేవ్ చెప్పారు. ఈ సినిమాను రానా నెక్ట్స్ లెవెల్‌కు తీసుకెళ్లారని చిత్ర నిర్మాత సృజన్ యరబోలు చెప్పారు. ఇది చిన్న సినిమా కాదనీ.. చాలా పెద్ద సినిమా అని ఆయన తెలిపారు.

ఆ సమయం వస్తే నేనే చెప్తా



'రన్ రాజా రన్' చిత్రంతో తెలుగుతెరకు పరిచయమయ్యారు సీరత్‌కపూర్. చాలా గ్యాప్ తర్వాత 'మనమే' చిత్రంలో ఓ ప్రత్యేక పాత్రలో మెప్పించారు. నటిగా, గాయినిగా రాణిస్తోన్న సీరత్.. ఈ మధ్య లవ్‌లో పడ్డారని.. అమన్ సింగ్ అనే నటుడితో డేటింగ్‌లో ఉన్నారంటూ రూమర్స్ వస్తున్నాయి. ఈ విషయమై ఓ విలేఖరి ఆమెను ప్రశ్నించగా.. ఇలా సమాధానమిచ్చారు. 'ప్రస్తుతం నా ఫోకస్ అంతా కెరీర్, ఫ్యామిలీ పైనే ఉంది. నేను ఏ విషయాన్ని దాచుకునే వ్యక్తిని కాదు. ఒకవేళ నా వ్యక్తిగత జీవితం గురించి మీ అందరికీ ఏ విషయమైనా తెలియాల్సిన సమయం వస్తే నేనే ముందుగా చెప్తాను. సినిమాల ఎంపికలో నా మనసు మాట వింటా. సినిమాల్లో నేను పోషించే పాత్రలు చాలా బాగుంటాయని అభిమానులు ప్రశంసిస్తుంటారు. అది నాకెంతో ఆనందాన్నిస్తుంది. ఈ ప్రశంసలు.. గుర్తింపు.. నేను పోషించే పాత్రలను మరింతగా ఆచితూచి ఎంచుకునేలా చేస్తాయి' అని చెప్పారు. రకుల్ ప్రీత్‌సింగ్ సోదరుడిగా ఇండస్ట్రీలో అడుగుపెట్టిన అమన్.. నటుడిగా సినిమాల్లో పలు సినిమాల్లో నటించారు. సీరత్ కపూర్ ఆలపించిన 'ఆవో నా' పాటలో సీరత్‌తో కలసి నటించారు. ఈ పాటలో వారిద్దరి కెమెస్ట్రీ అందరినీ ఆకట్టుకుంది.

ఆకట్టుకునే అన్నాచెల్లెళ్ల కథతో



అన్నాచెల్లెళ్ల అనుబంధం నేపథ్యంలో ఇంటిల్లిపాదిని ఆకట్టుకునే గ్రామీణ కథాంశంతో రూపొందుతున్న చిత్రం 'చిట్టి పొట్టి'. భాస్కర గ్రూప్ ఆఫ్ మీడియా బేనర్‌పై భాస్కర్ యాదవ్ దాసరి స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్నారు. రామ్ మిట్టకంటి, పవిత్ర, కస్వి ప్రధాన పాత్రల్లో నటించారు. త్వరలోనే ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇటీవలే చిత్రబృందం గ్లింప్స్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'కుటుంబ అనుబంధాల నేపథ్యంలో ఈ చిత్రం రూపొందుతోంది. ఒక ఆడబిడ్డకు పుట్టింటిపై ఉన్న మమకారాన్ని తెలిపే చిత్రమిది. మహిళల గొప్పతనం నేపథ్యంలో కథ సాగుతుంది. ఈ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులకు కనెక్ట్ అవుతుందని చెప్పారు. కాంతమ్మ, ఆచారి, హర్ష కీలకపాత్రలు పోషించిన ఈ చిత్రానికి సంగీతం: శ్రీ వెంకట్, సినిమాటోగ్రఫీ: జోషీ, ఎడిటర్: బాలకృష్ణ బోయ

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/gt8lkfR లో చదవండి.

అరకొర సౌకర్యాలు.. ఆపై అవస్థలు

● రోడ్లు, కాలువలు లేక ఇబ్బందులు ● రెండేళ్లుగా నిర్లక్ష్యం ● ఇదీ ఆఫ్‌షోర్ నిర్వాసిత కాలనీ దుస్థితి

(పలాస రూరల్)

జిల్లాలోని ప్రధాన నీటి వనరుల్లో ఒకటైన ఆఫ్‌షోర్ రిజర్వాయర్ నిర్మాణానికి భూములిచ్చిన ప్రజ లకు కేటాయించిన నిర్వాసిత కాలనీలో కనీస సదుపాయాలు లేక స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాము భూములిచ్చినా ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల ఇక్కట్లకు గురవుతున్నామని వారు ఆవేదన చెందుతున్నారు.. ఇదీ టెక్కలిపట్నం నిర్వాసిత కాలనీ దుస్థితి.. వివరాలిలా ఉన్నాయి.. 2008లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం రేగులపాడు వద్ద ఆఫ్‌షోర్ రిజర్వాయర్ నిర్మాణానికి సిద్ధమైంది. ఈ ప్రాజెక్టు నిర్వాసితుల్లో మొత్తం మూడు మండలాలకు చెందిన వారు ఉన్నారు. పలాస మండలం రేగులపాడు వద్ద నిర్మిస్తున్న ఆఫ్‌షోర్ రిజర్వాయర్ నిర్మాణం చేపట్టగా నందిగాం మండలం చినగురు దాసుపురం, మెళియాపుట్టి మండలం చీపురుపల్లి, దాసుపురం, పలాస మండలం రేగులపాడు గ్రామా లకు చెందిన వారు తమ విలువైన భూములను త్యాగం చేశారు. పలాస మండలం టెక్కలిపట్నం వద్ద చీపురుపల్లి, రేగులపాడు గ్రామాలకు చెందిన కొంతమంది నిర్వాసితులకు ఆర్‌ఆర్ కాలనీని ఏర్పాటు చేశారు. ఎక్కువ మంది చీపురుపల్లి నిర్వాసితులే.. ఈ ప్రాంతంలో సుమారు 70 నుంచి 80 మంది ఇళ్ల నిర్మాణం చేపట్టి నివాసం ఉంటున్నారు. అయితే ప్రభుత్వం నిర్వాసితులను ఆదుకునేందు కు కాలనీలు ఏర్పాటు చేసినా సరైన రోడ్లు, కాలువల నిర్మాణం చేపట్టకపోవడం వారు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. కాలనీ ఏర్పాటు, తాత్కాలిక రోడ్ల నిర్మాణం చేపట్టినా ఆ తరువాత గడచిన రెండేళ్లుగా కాలనీలో సదుపాయాల నిర్మాణంపై అప్పటి ప్రభుత్వం నిర్లక్ష్యం వహించింది. దీంతో కాలువలు, రోడ్ల నిర్మాణం చేపట్టలేదు. ఇళ్ల వాడిక నీరు కచ్చారోడ్డుపైకి వచ్చి నిలిచిపోవడంతో రాకపోకలకు వారు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. పైగా ఈ మురుగునీటిలో దోమలు ఉత్పత్తి చెంది అనారోగ్యం బారినపడుతున్నామని వాపోతున్నారు. రాత్రి సమయాల్లో వీధి లైట్లు వెలగకపోవడంతో వాహన లైట్లు, మొబైల్ వెలుగులో ఇళ్లకు వెళ్లాల్సి వస్తోందని, ఒక్కో సమయంలో విష సర్పాలు కనిపించి భయాందోళన చెందాల్సిన దుస్థితి ఏర్పడిందని వారు ఆవేదన చెందుతున్నారు. విలువైన భూములను రిజర్వాయర్ నిర్మాణానికి ఇస్తే మాకు కనీస వసతులు కల్పించడం లేదని, దీనిపై అధికారుల దృష్టికి అనేకపర్యాయలు తీసుకువెళ్లినా స్పందించలేదని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికా రులు స్పందించి పునరావాస కాలనీలో కనీస సదుపాయాలను కల్పించాలని వారు కోరుతున్నారు. దీనిపై పలాస ఆర్డీవో భరత్‌నాయక్ వద్ద ప్రస్తావించగా కాలనీని సందర్శించి చర్యలు తీసుకుంటామన్నారు.



టెక్కలిపట్నం ఆర్‌ఆర్‌కాలనీలో రోడ్డు దుస్థితి



బురదమయంగా ఉన్న రోడ్డు

మౌలిక సదుపాయాలు కల్పించాలి..



నిర్వాసిత కాలనీలో సరైన మౌలిక సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నాం. గతంలో ఈ విషయంలో అధికారులకు విన్నవించినా సరైన స్పందన రాలేదు. కనీసం రోడ్ల నిర్మాణమైనా చేపట్టాలి.

-వంకల ఖగేశ్వరరావు, ఆర్‌ఆర్‌కాలనీ, టెక్కలిపట్నం

కాలువలు, లైట్లు లేవు..



నిర్వాసిత కాలనీలో కాలువ వ్యవస్థ లేదు. ఇంటివాడుక నీరు రోడ్డుపైకి చేరుతోంది. రాత్రిళ్ల లైట్లు వెలగకపోవడంతోఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. సమస్యలు పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

-దాసరి ఖగేశ్వరరావు, టెక్కలిపట్నం

అక్రమ లే అవుట్లపై ఉక్కుపాదం

● ప్రభుత్వ ఖజానాకు గండికొట్టిన వెంచర్‌దారులు
● వైసీపీ ప్రభుత్వ హయాంలో చర్యలు శూన్యం
● ఎట్టకేలకు అధికారుల్లో చలనం

పలాస, జూలై 3: పలాస- కాశీబుగ్గ మునిసిపాలిటీలో అక్రమ లేఅవుట్లపై టౌన్ ప్లానింగ్ అధికారులు చర్యలు ప్రారంభించారు. గత ఐదేళ్లుగా సుమారు 40 అనధికార వెంచర్లు వేసి డబ్బులు దండుకున్నారు. దీంతో కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. దీనిపై ఆంధ్రజ్యోతి అనేక కథ నాలు ప్రచురించినా అధికారులు పట్టించుకోలేదు. ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో మునిసి పల్ అధికారులు అక్రమ లేఅవుట్లపై దృష్టి సారించారు. చిన్నబడాం, తాళభద్ర, నీలావురం, పెసరపాడు, కోసంగిపురం, నెమలి నారాయణపురం, కంబిరిగాం రోడ్‌లో ఇష్టానుసారంగా భూమిని చదును చేసి అనుమతులు లేకుండా ప్లాట్లు వేసి విక్రయిస్తున్నారు. అయితే వీటికి ఎటు వంటి అనుమతులు తీసుకోలేదు. ఈ అక్రమ లేఅవుట్లు క్రమబద్ధీకరిస్తే ప్రభుత్వానికి రూ.30 కోట్లకు పైగా ఆదాయం వచ్చే అవకాశం ఉందని సాక్షాత్తు అధికారులే చెబుతున్నారు.



చిన్నబడాం వద్ద అనుమతులు లేని లేఅవుట్‌లో రోడ్డును తొలగించిన దృశ్యం

చిన్నబడాంలో అక్రమ లేఅవుట్‌పై చర్యలు

చిన్నబడాం సర్వే నెంబరు 70/3లో 2.70 ఎకరాల్లో వేసిన అక్రమ లేఅవుట్‌ను మునిసిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు గుర్తించారు. ఈ మేరకు బుధవారం సిబ్బంది సాయంతో లేఅవుట్‌లో వేసిన రోడ్లను ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. అక్రమ లేఅవుట్లపై నిర్వాహకులకు నోటీసులిచ్చినా పట్టించు కోలేదని, దీంతో తాము కమిషనర్ ఆదేశాల మేరకు తొలగించామని టీపీవో అప్పలరాజు తెలిపారు. అక్రమ లేఅవుట్లను క్రమబద్ధీకరించుకోవాలని, నిబంధన ప్రకారం అనుమతులు తీసుకొని ప్లాట్లు అమ్ముకోవాలనిసూచించారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారులు ప్రేమ్‌చంద్, గుప్తా, శ్రీను, భాస్కరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ కార్యాలయ ఉద్యోగికి ఇళ్ల పట్టా?



రెవెన్యూ కార్యాలయం సమీపంలో చదును చేసిన ఖరీదైన స్థలం

పోలాకి: మండల కేంద్రంలోని నడిబొడ్డున ఖరీదైన ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్న విమ ర్శలు వినిపిస్తున్నాయి. తాజాగా రెవె న్యూ వెలుగు కార్యాలయాల నడుమ ఉన్న వాటర్ ట్యాంక్ సమీపంలో విలువైన స్థలాన్ని ఆక్రమణదారు చదును చేస్తున్నారు. ఈ విషయమై స్థానికులు ఆయనను అడుగ్గా తనకు రెవెన్యూ అధికారులు పట్టా ఇచ్చారని చెబుతున్నాడని, అయితే సదరు వ్యక్తి రెవెన్యూ కార్యాలయ ఉద్యోగి అని, ప్రభు త్వ ఉద్యోగికి ప్రభుత్వ స్థలం పట్టాల ఎలా ఇస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఐదు రోజుల్లోనే పట్టా ఇచ్చారని, దీనికి ఎవరు రికమెండ్ చేశారని పలువురు స్థానిక యువకులు ప్రశ్నిస్తున్నారు. తగు విచా రణ చేపట్టి ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించాలని వారు కోరుతున్నారు. దీనిపై తహసీల్దార్ ప్రసాదరావును వివరణ కోరగా తాను ఎన్నికల విధుల్లో వచ్చానని, రెవెన్యూ వ్యవహారాలు ఇంకొకరు చూస్తున్నారన్నారు. విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు.

స్థల వివాదంలో ఇరువర్గాల ఫిర్యాదు

టెక్కలి: టెక్కలి జడ్పీ రోడ్డులో ఓ టింబర్ డిపో పక్కన బుధవారం ఇరువురి మధ్య స్థల వివా దం చోటుచేసుకుంది. రిజిస్ట్రేషన్ దస్తావేజు ద్వారా కొనుగోలు చేసి కోర్టు డిక్రీ, పెర్మినెంట్ ఇంజక్షన్ పొందిన స్థలంలో నిర్మాణం చేసేందుకు స్థల యజమాని అర్జున్ మహారాణా వెళ్లగా ఈ స్థలం మా దంటూ పట్టణానికి చెందిన టీఎస్ఎన్ రమణ, ఆకుల గౌరీశంకర్, బి.నందికేసు అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య వివాదం పెద్దది కావడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఇరు వర్గాలను శాంతింపజేసి తాత్కాలికంగా పనులు నిలిపివేయించారు. అయితే తన వద్ద అన్ని హక్కులున్నాయని, తాను మూడు కోర్టుల పరిధిలో గెలిచిన పత్రాలు, రెవెన్యూ అధికారులు ఇచ్చిన హద్దుల వివరాలను అర్జున్ మహారాణా పోలీసులకు చూపించారు. ఈ నేపథ్యంలో రెండు వర్గాల వారు పోలీసులకు ఫిర్యాదులు చేశారు.

పంట కాలువల పనులు చేపట్టండి



మాట్లాడుతున్న పీడీ చిట్టిరాజు

నరసన్నపేట: మండలాల్లో ముమ్మరంగా పంట కాలువల్లో పూడికతీత పనులు చేయించాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ జీవీ చిట్టిరాజు సూచించారు. బుధవారం స్థానిక డ్వామా కార్యాలయంలో నాలుగు మండలాల ఉపాధి హామీపథకం సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లోని పిల్లకాలువల్లో పూడికతీత చేపట్టి ప్రతీ ఎకరాకు సాగునీరందించాలన్నారు. ఇరిగేషన్ అధికారులతో సమన్వయంచేసుకుని ప్రధాన కాలువల్లో పనులకు ప్రణాళిక రూపొందించాలన్నారు. మొక్కలు పెంపకం చేపట్టాలన్నారు. వర్షపునీరు వృథా కాకుండా ఉండేలా అవసరమైన ప్రాంతాల్లో కాంటూర్ బండింగ్‌లను ఏర్పాటు చేసి భూగర్భ జలాలను పెంచాలన్నారు. సిబ్బంది పనితీరు బాగుండాలని, ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీడీలు మురళీకృష్ణ, జయరాం, ఏపీవోలు యుగంధర్, రమణ, నారాయణరావు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

జిల్లా కేంద్ర ఆసుపత్రిలో ఏఆర్టీ సేవలు



ఏఆర్టీ పరికరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ సూర్యారావు

టెక్కలి: జిల్లా కేంద్ర ఆసుపత్రిలో హెచ్ఐవీ వ్యాధిగ్రస్థులకు సంబంధించి ఏఆర్టీ సేవలు బుధవారం నుంచి అందుబాటులోకి వచ్చాయి. ఈ సేవలను ఆసుపత్రి సూపరింటెం డెంట్ డాక్టర్ బి.సూర్యారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హెచ్ఐవీ చికిత్సలో సీడీ-4 పరీక్షలు తప్పనిసరని, ఈ ఆసుపత్రిలో సుమారు రెండువేల మంది సేవలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో డాక్టర్ అరుణకుమారి, ఏఆర్టీ నోడల్ ఆఫీసర్ అపర్ణ, వైద్యాధికారి శివరామకృష్ణ, ఏఆర్టీ, ఐసీటీసీ సిబ్బంది పాల్గొన్నారు.

కుక్కల దాడిలో దుప్పికి గాయాలు



మందస: మందస అడవుల నుంచి తప్పిపోయి పట్టణం వైపు బుధవారం ఓ దుప్పి రాగా కుక్కలు దాడికి పాల్పడ్డాయి. గాయపడిన దుప్పి ఓ ఇంటిలోకి చొరబడడంతో స్థానికులు అటవీ శాఖాధికారులకు సమాచారం ఇచ్చారు. వెంటనే అటవీ సిబ్బంది వచ్చి దుప్పికి వైద్య పరీక్షలు చేయించారు. దుప్పి ఆరోగ్యం మెరుగుపడడంతో తిరిగి అడవిలో విడిచిపెట్టారు.

సొంత సొమ్ముతో రోడ్డుకు మరమ్మతులు



గోతులను పూడ్చిన దృశ్యం

హరిపురం: బీఎస్ పురం పంచాయతీ రాధా కృష్ణపురం నుంచి హైవేకి వెళ్లే మార్గం లో రోడ్డు గోతులమయం కావడంతో జనసేన నాయకుడు సంతోష్‌కుమార్ పండా బుధవారం కంకర, మట్టిని వేసి తాత్కాలికంగా బాగు చేశారు. తన సొంతనిధులు వెచ్చించి కంకర వేసి గోతులు పూడ్చారు. దీంతో స్థానికులతోపాటు వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రిటైర్డ్ ఉద్యోగులకు సకాలంలో పెన్షన్‌పై హర్షం

టెక్కలి: రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులకు సకాలంలో పెన్షన్ అందజేయడంపై రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లాశాఖ అధ్యక్షుడు రోణంకి రామచంద్రరావు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. పెన్షనర్లపట్ల రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం చూపిన చిత్తశుద్ధిపై కృతజ్ఞతలన్నారు. ఆర్థికంగా ఇబ్బందులున్నా పెన్షన్‌దారుల సమస్యలను గుర్తించి పెన్షన్ అందజేయడం ప్రభు త్వ ప్రధాన బాధ్యతల్లో ఒకటిగా గుర్తించడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు.

పీహెచ్‌సీ నిర్వహణపై ఎమ్మెల్యే ఆగ్రహం

● తీసుకునే జీతాలకు న్యాయం చేయాలన్న మామిడి గోవిందరావు
● విచారణ చేయాలని డీఎంహెచ్‌వోకు సూచన



రికార్డులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

పాతపట్నం: తీసుకొనే జీతాలకు న్యాయం చేయండంటూ ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. బుధవారం బైదలాపురం పీహెచ్‌సీని ఆకస్మికంగా సందర్శించారు. పీహెచ్‌సీలో వైద్యులు అందుబాటులో లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం జీతాలిస్తున్నది పేద ప్రజలకు సేవలందించేందుకని, అయితే విధులకు సకాలంలో రాకపోతే ఎందుకు పీహెచ్‌సీని నిర్వహించాలని ప్రశ్నించారు. ఓపీ, ఐపీ మందుల వివరాలు, వివిధ రికార్డులను పరిశీలించారు. పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది పనితీరుపై అసహనం వ్యక్తంచేశారు. వెంటనే డీఎంహెచ్‌వో డా.శ్రీదేవిని ఫోన్‌లో సంప్రదించి అసలే సీజనల్ వ్యాధులు ప్రబలే సమయంలో వైద్యులు రోగులకు అందుబాటులో ఉండకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని, తగు విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని సూచించారు.

విద్యార్థినికి అభినందన

ఇటీవల జరిగిన పదో తరగతి పరీక్షల్లో జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన మెళియా పుట్టి మండలం కొసమాల గ్రామానికి చెందిన మామిడి సోనియాను ఎమ్మెల్యే గోవిందరావు అభినందించారు. బుధవారం తన క్యాంపు కార్యాలయంలో రామరాజు చారిటబుల్ ట్రస్ట్ పురస్కారాన్ని విద్యార్థినికి అందించారు. కార్యక్రమంలో మెళియాపుట్టి మాజీ ఎంపీపీ సలాన మోహనరావు, ట్రస్టు ప్రతినిధులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు అండగా కూటమి ప్రభుత్వం: ఎమ్మెల్యే బగ్గు



ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తిని సత్కరిస్తున్న దివ్యాంగ సంఘ నేతలు

నరసన్నపేట: దివ్యాంగులకు అండగా కూటమి ప్రభుత్వం ఉంటుందని, సీఎం చంద్రబాబు నాయకత్వంలో ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. దివ్యాంగు లకు పింఛన్లు రెండింతలు పెంపుతో బుధవారం పార్టీ కార్యాలయంలో దివ్యాంగుల హక్కుల సాధన కమిటీ ఆధ్వర్యంలో ఆయనను అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లా డుతూ.. దివ్యాంగుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. పింఛన్ రూ.3 వేల నుంచి రూ.6 వేలు పెంచి భరోసా ఇచ్చిందన్నారు. దివ్యాంగులకు రిజర్వేషన్లు కల్పించి ఉద్యోగాల్లో అవకాశం ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు ఉణ్న సాయిగుప్త, రమణమూర్తి టీడీపీ నాయకులు గొద్దు చిట్టిబాబు, జామి వెంకట్రావు, బోయన సతీష్, కింజరాపు రామారావు, బైరి భాస్కరరావు, గొలివి రామారావు, బలగ భారతి తదితరులు పాల్గొన్నారు. అనంతరం పార్టీ కార్యాలయంలో ప్రపంచ ప్లాస్టిక్ రహిత దినోత్సవం సందర్భంగా మొక్కను నాటారు. ప్రతీ కార్యకర్త మొక్కను నాటి పరిరక్షించాలని ఆయన సూచించారు.

విద్యా కిట్లు పంపిణీ

మబగాం(పోలాకి): నూతన ప్రభుత్వం విద్యార్థులకు మంజూరు చేసిన విద్యా కిట్లను బుధ వారం ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అందజేశారు. ఉన్నత పాఠశాల హెచ్ఎం రాధాకృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గ్రామపెద్ద రవి, విద్యా కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిరుపేదలకు అన్నిరకాల రేషన్: ఎమ్మెల్యే శిరీష



రేషన్ సరుకులు అందజేస్తున్న ఎమ్మెల్యే శిరీష

హరిపురం: నిరుపేదలకు బియ్యంతోపాటు అన్ని రకాల సరుకులను డిపోల ద్వారా అందజేయనున్నామని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. సువర్ణాపురం గ్రామం లో బుధవారం రేషన్ దుకాణాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఉచిత బియ్యంతోపాటు కంది పప్పు, పంచదార, అన్ని రకాల దినుసులను అందిస్తామన్నారు. ప్రజా పంపిణీని సులభతరం చేసి దుర్వినియోగం లేకుండా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బావన దుర్యోధన, నేతలు బమ్మిడి కర్రయ్య, దాసరి తాతారావు, వి.మాధవరావు, కరిగాన వాసు, సాలిన భీమారావు, రుద్రయ్య, లచ్చయ్య తది తరులు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: ఎమ్మెల్యే గౌతు శిరీషను పూండి గోవిందపురానికి చెందిన శ్రీసాయి మణికంఠ సంఘం సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. సంస్థ అధ్యక్షుడు లావేటి శంకర్, పి.రమణ, ఎ.చిన్నారావు బుధవారం ఆమెను కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువతో సత్కరించారు.

మాడవీధుల నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరు



మాడవీధులను పరిశీలిస్తున్న పీఆర్ ఏఈ శ్రీధర్

జలుమూరు: దక్షిణకాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీముఖలింగేశ్వరాలయం మాడ వీధుల నిర్మాణానికి రూ.20 లక్షలు మంజురైనట్లు పంచాయతీరాజ్ ఏఈ శ్రీధర్ తెలిపారు. ఈ మేరకు బుధవారం మాడవీధులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఏ రోడ్డు పనులు చేపట్టాలనే దానిపై కొలతలు వేసి పనులకు శ్రీకారం చుడుతున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఆదేశాల మేరకు మిగతా మాడ వీధుల్లో రోడ్ల నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపిస్తున్నామని, నిధుల మంజూ రైన వెంటనే పనులు చేపడతామన్నారు. సర్పంచ్ తమ్మన్నగారి సతీష్, మాజీ సర్పంచ్ తర్ర బలరాం, టీడీపీ నాయకుడు వెంకటదాసు, అర్చకులు పాల్గొన్నారు.

21 దివ్యాంగ పింఛన్ల నిలుపుదల

జలుమూరు: సైరిగాం పంచాయతీలో 21 మంది దివ్యాంగ పింఛన్లను ఈనెల నిలుపుదల చేసినట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో పి.ఉమామహేశ్వరరావు తెలిపారు. బోగస్ దివ్యాంగ ధ్రువీకరణ పత్రాలతో పింఛన్లు పొందుతున్నట్లు వచ్చిన ఫిర్యాదుల మేరకు విచారణ చేయాలని గత నెలలో గ్రామస్థులు జిల్లా అధికారులకు ఫిర్యాదుచేశార న్నారు. దీనిపై గత నెల 29న నరసన్నపేట ప్రాంతీయ ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించే పరీక్షలకు ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని సదరు వ్యక్తులకు నోటీసు లిచ్చామన్నారు. అయితే ఏ ఒక్క లబ్ధిదారు హాజరు కాకపోవడంతో వారి పింఛన్లను నిలుపుదల చేశామన్నారు. ఇదేవిధంగా బోగస్ ధ్రువపత్రాలతో జిల్లాలో అనేక మంది పింఛన్లు పొందుతున్నారని, వారి సర్టిఫికేట్లు పరిశీలించి బోగస్‌లను తొలగించాలని పలువురు కోరుతున్నారు.

అధ్వానంగా శివరాంపురం రోడ్డు



రాళ్లు తేలి దారుణంగా ఉన్న శివరాంపురం రోడ్డు

వజ్రపుకొత్తూరు: మండలం కేంద్రానికి సమీపంలో ఉన్న రోడ్డు ఇది. గల్లి జంక్షన్ నుంచి శివరాం పురం వెళ్లే మార్గంలో గ్రావెల్ రోడ్డు రాకపోకలకు అనువుగా ఉండేది. అయితే వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాడంతో బీటీ రోడ్డు వేసేందుకు చర్యలు తీసుకోవడంలో భాగంగా ఉన్న రోడ్డుపై రాళ్లు వేసి వదిలేశారు. నాలుగేళ్లు గడిచినా ఇంతవరకు బీటీ రోడ్డు వేయలేదు. దీంతో శివరాంపురం గ్రామస్థులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్డుపై రాళ్లు తేలి ఉండ డంతో ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్ప టికైనా అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

నందిగాం: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం సాధ్యమని మండల ప్రత్యేకాధికారి కేయూపీ రమణి అన్నారు. బుధవారం దిమ్మిడిజోల, కల్లాడ, నౌగాం తదితర గ్రామాల్లో ఆమె పర్యటించి పారి శుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు పరిసరాలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఎప్పటికప్పుడు పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో టి.రాజారావు, కార్యదర్శులు కె.సంతోష్‌కుమార్, చంద్రశేఖర్, ఢిల్లేశ్వరరావు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై అవగాహన కలిగించాలి

నరసన్నపేట: గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై అవగాహన కలిగించాలని మండల ప్రత్యేకాధికారి కవిత అన్నారు. బుధవారం మడపాంలో పారిశుధ్య పనులను పరిశీలించారు. వర్షాకాలంలో డెంగ్యూ, విషజ్వరాలు రాకుండా కాలువలను శుభ్రం చేయాలని పంచాయతీ అధికారులకు సూచించారు. తాగునీటి బావుల్లో క్లోరినేషన్ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అందించాలి

నరసన్నపేట: స్థానిక టూ వీలర్స్ మెకానిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంఘ భవనంలో బుధవారం మెకానిక్ డే వేడుకలను నిర్వహించారు. మెకానిక్ జీవితాల్లో వెలుగులు నింపేందుకు ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయాలని సంఘ నాయకులు సోమేశ్వరరావు, మోహనరావు కోరారు. చదువులో రాణించిన మెకానిక్ పిల్లలకు బహుమతులను అందజేశారు. ● **పాతపట్నం:** సంఘటితంగా ఉంటేనే సమస్యలకు పరిష్కారం లభిస్తుందని మెకానిక్ సంఘ సభ్యులు అన్నారు. శ్రీసాయిదుర్గ పెట్రోల్, డీజిల్ మెకానిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం మెకానిక్స్‌డే నిర్వహించారు. కేక్ కట్ చేసి పంపిణీ చేశారు.

గ్రంథాలయాల ఆకస్మిక తనిఖీ

మందస/పలాస రూరల్: మందస, పలాస శాఖా గ్రంథాలయాను బుధవారం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.కుమార్ రాజా ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. పాఠకుల అవసరాలకు తగిన పుస్తకాలు అడిగి తెప్పించాలని గ్రంథాలయాధికారులు విజయలక్ష్మి, రాంబాబులకు సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ సెక్రటరీ శంకరరావు పాల్గొన్నారు.

నేడు టీడీపీ విస్తృతస్థాయి సమావేశం

వజ్రపుకొత్తూరు: స్థానిక టీడీపీ కార్యాలయంలో గురువారం పార్టీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు సూరాడ మోహనరావు తెలిపారు. ఈ సమావేశంలో కూటమి విజయంపై కార్యకర్తలకు అభినందన కార్యక్రమం ఉంటుందన్నారు. ముఖ్య నాయకులు, కార్య కర్తలు, అభిమానులు హాజరుకావాలని కోరారు.

అర్హులైన కౌలు రైతులకు 'అన్నదాత సుఖీభవ'

తురకపేట(ఎల్.ఎన్.పేట): గ్రామీణ ప్రాంతాల్లో పంటలు సాగు చేస్తున్న అర్హులైన కౌలు రైతులందరికీ ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం వర్తింప జేస్తుందని వ్యవసాయాధికారి పి.లతాశ్రీ అన్నారు. తురకపేట గ్రామంలో బుధవారం రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కౌలుకు సాగు చేసి పంటలు పండిస్తు న్న కౌలు రైతులు ప్రభుత్వ నిబంధనల మేరకు గుర్తింపు కార్డు పొందాలన్నారు. ఈ కార్డు ఉంటే పంట నష్టపరిహారం, పంట లబీమా తదితర ఆర్థిక సంబంధ రాయితీలు పొందేందుకు వీలుంటుందన్నారు. సమావేశంలో సర్పంచ్‌లు ఎం.యోగీశ్వరి, ఎం.మోహిని, ఎంపీటీసీ పి.జయలక్ష్మి, ఆర్ఐ ఎస్.గవరయ్య, రెవెన్యూ కార్యదర్శి జోగి నాయుడు, పంచాయతీ కార్యదర్శి జి.తవిటినాయుడు తదితరులు పాల్గొన్నారు. ● **నందిగాం:** కౌలురైతులు కార్డులు కలిగి ఉండడం ద్వారా రాయితీలు పొందవచ్చని తహసీల్దార్ వి.పద్మావతి, వ్యవసాయాధికారి పి.శ్రీకాంత్‌వర్మ అన్నారు. బుధవారం హర్షబాడ, నౌగాంల్లో కౌలు రైతుల అవగాహన సదస్సులు నిర్వహించారు.

పబ్లిక్ నోటీసు

నా క్లయింటు M/s. శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ శ్రీకాకుళం-2 వారి ... శ్రీకాకుళం జిల్లా, రాజాం మండలం, ... వారణాశి ఉషారాణి W/o గణేష్‌కుమార్ ... వారణాశి గణేష్‌కుమార్ ...

షెడ్యూలు: పార్వతీపురం మన్యం జిల్లా, పార్వతీపురం మండలం, అడ్డాపుశీల గ్రామం పరిధిలో గల సర్వే నెం.206/13 గల తూ.ప.లకు 30 అడుగులు, ఉ.ద.లకు 50 అడుగులు, మొత్తం 166.66 చ.గ.లు గల ఖాళీస్థలమునకు హద్దులు: తూర్పు: ప్లాటు నెం.1292కు, దక్షిణం: 20 అడుగుల వెడల్పు గల రోడ్డు, పశ్చిమం: ప్లాటు నెం.1294కు, ఉత్తరం: ఎస్.వి.డి.వారి భూమి

టి.బాల మురళీకృష్ణ, అడ్వకేట్
డోర్ నెం.11-6-59, కొల్లా వారి వీధి, శ్రీకాకుళం
సెల్: 9247315759

క్రిస్టియన్ డే ప్రార్థనలు

పాతపట్నం: స్థానిక జేసీ పీఎండ్‌ఈఎం చర్చిలో బుధవారం ఇండియన్ క్రిస్టియన్ డే వేడుకను నిర్వహించారు. పాస్టర్లు మాట్లాడుతూ.. క్రీస్తు బోధనలు సర్వమానవాళికి శాంతిమార్గం చూపుతున్నాయన్నారు. పాస్టర్ జి.ప్రసాద్, పలువురు క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ట్రాక్టర్ బోల్తాపడి యువకుడి మృతి

- తల్లిదండ్రులకు పుత్రశోకం
- పది నెలల్లోనే ఇద్దరు కుమారులు మృతి
- పెద్దతామరాపల్లిలో విషాదం



వంశీ (ఫైల్)



కాలువలో బోల్తాపడిన ట్రాక్టర్

టెక్కలి/ నందిగాం: టెక్కలి మండలం శాసనాం పంచాయతీ కొండభీంపురం సమీపంలో బుధవారం మట్టిలోడుతో వెళ్తున్న ట్రాక్టర్ అదుపుతప్పి కాలువలో బోల్తాపడింది. ఈ ఘటనలో ట్రాక్టర్ డ్రైవర్ పోలాకి వంశీ(27) అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడిది నందిగాం మండలం తామరాపల్లి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని టెక్కలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు వంశీ తల్లి బోడెమ్మ, తండ్రి తిరుపతిరావు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఈ మేరకు టెక్కలి పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆ తల్లిదండ్రులకు పుత్రశోకం

వంశీ మృతి చెందడంతో ఆ తల్లిదండ్రులు పుత్రశోకంతో అల్లాడుతున్నారు. పది నెలల వ్యవధిలోనే ఇద్దరు కుమారులు ప్రమాదవశాత్తు మృత్యువాత పడడంతో వారిని ఓదార్చడం ఎవరితరం కాలేదు. దీంతో ఆ కుటుంబంతో పాటు గ్రామంలోనూ విషాదం అలముకుంది. పెద్ద తామరాపల్లికి చెందిన పోలాకి బుద్దెమ్మ, తిరుపతిరావు రెండో కుమారుడు పోలాకి వంశీ ట్రాక్టర్ నడుపుకుంటూ, వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. బుధవారం వంశీ ట్రాక్టర్‌తో మట్టిలోడుతో వెళ్తూ బోల్తాపడి మృతి చెందాడు. ఇతడి సోదరుడు మధు కూడా పది నెలల కిందట రైలు ప్రమాదంలో మృతిచెందడంతో ఆ కుటుంబానికి తీరని వేదన మిగిలింది. ఇద్దరు కుమారులు కూడా ప్రమాదాల్లో మృతిచెందడాన్ని తల్లిదండ్రులతో పాటు బంధువులు రోదిస్తున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

సోంపేట: బాతుపురం, కొత్త బాతుపుర గ్రామాల మధ్య ఉన్న చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బుధవారం స్థానికుల సమాచారం మేరకు బారువ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి వయసు సుమారుగా 50 ఏళ్లు ఉంటాయని, ఆచూకీ తెలిసిన వారు బారువ పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. హిందీ, బెంగాలీలో మాట్లాడుతూ ఆకలి తీర్చమని అడిగినట్టు దర్యాప్తులో స్థానికుల ద్వారా గుర్తించామన్నారు. రోజంతా పరిసరాల్లో తిరిగి మంగళవారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుని ఉండొచ్చన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

117 జీవో తక్షణమే రద్దుచేయాలి



మాట్లాడుతున్న డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

పొందూరు: ఉపాధ్యాయులకు తీవ్రనష్టం కలుగజేస్తున్న 117 జీవోను తక్షణమే ప్రభుత్వం రద్దు చేయాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పూజారి హరిప్రసన్న కోరారు. లైదాం పాఠశాలలో బుధవారం జరిగిన కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వం ఉపాధ్యాయులపై కక్షపూరితంగా వ్యవహరించిందని ఈ ప్రభుత్వం ఉపాధ్యాయులతో స్నేహ పూర్వకంగా ఉంటుందని ఆశిస్తున్నామన్నారు. ఉద్యోగులకు మధ్యంతర భృతిని ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో డీటీఎఫ్ పొందూరు అధ్యక్షుడు బి.వెంకటేశ్వరరావు, జి.గోపాలరావు, జి.రామారావు, సీహెచ్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

హోం మంత్రికి అభినందన



హోం మంత్రిని సన్మానిస్తున్న ఆనాటి ఉపాధ్యాయుడు రామావతారం

పొందూరు: చదువునేర్పిన గురువు చేతుల మీదుగా సన్మానం అందుకోవడం పూర్వజన్మ సుకృతమని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. విశాఖ లోని మంత్రి గృహంలో పొందూరుకు చెందిన, మంత్రికి చిన్ననాటి గురువు వాం ద్రంగి రామావతారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. 30 ఏళ్ల కిందట రామావతారం ఇచ్ఛాపురంలో ఉపాధ్యాయుడిగా పనిచేసేటప్పుడు, అతడి వద్ద విద్యార్థినిగా విద్యనభ్యసించింది. చిన్న నాడు విద్యనేర్పిన గురువు 30 ఏళ్ల తర్వాత కలవడంతో అనిత ఆనందం వ్యక్తం చేసినట్టు రామావతారం తెలిపారు.

ఇసుక అక్రమ రవాణాపై చర్యలేవి?

ఇచ్ఛాపురం: బాహుదానదీ తీర ప్రాంతాల నుంచి ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నా పట్టించుకోరా అంటూ టీడీపీకి చెందిన ఎంపీటీసీ దక్కత ఏకాంబరి అధికారులను నిలదీశారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బోర పుష్ప అధ్యక్షతన మండల సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. ఇసుక అక్రమ రవాణాపై సభ్యులు అధికారులను ప్రశ్నించగా, అక్రమ రవాణాకు ఎటువంటి అనుమతులు లేవని ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ సమాధానం చెప్పారు. జల్‌జీవన్ మిషన్ పైపులైన్ లీకులు వల్ల తాగునీరు సక్రమంగా రావడం లేదని ఎంపీటీసీ సభ్యులు త్రినాథ్ ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ కృష్ణారావును నిలదీశారు. అధికారులు పూర్తిస్థాయిలో హాజరు కాకపోవడంపై ఎంపీటీసీ చక్రవర్తి ఎంపీడీవోను ప్రశ్నించారు. పింఛన్ల పంపిణీలో అధికారులు పట్టించుకోకపోవడంపై పలువురు ప్రజాప్రతినిధుల అసహనం వ్యక్తం చేశారు. కేసుపురం గ్రోయివన్ ద్వారా పూర్తిస్థాయిలో సాగునీరు అందివ్వాలని ఇరిగేషన్ ఏఈ పాణిగ్రాహిణి కోరారు. గత వైసీపీ పాలనలో ఎంతో అభివృద్ధి జరిగిందని ఎమ్మెల్సీ నర్తు రామారావు అనడంపై వైసీపీ రెబల్ ఎంపీటీసీ చక్రవర్తి స్పందించి మాట్లాడారు. గత ప్రభుత్వంలో పంచాయతీల్లో ఎటువంటి అభివృద్ధే జరగలేదన్నారు. విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయంపై ఏఈ గోవిందరావును సభ్యులు ఏకాంబరి, వివేకానంద, నర్తు ప్రసాద్ నిలదీశారు. అన్ని గ్రామాల్లో కోతులు బెడద ఎక్కువగా ఉందని, అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని టీడీపీకి చెందిన ఎంపీటీసీ దక్కత ఏకాంబరి ఫారెస్ట్ అధికారులను కోరారు. కార్యక్రమంలో జడ్పీటీసీ ఉప్పాడ నారాయణమ్మ, ఎంపీపీ పుష్ప, ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఎరువుల పంపిణీ

బూర్జ: డొంకలపర్త, అల్లెన గ్రామాల్లోని రైతులకు ఎరువులు పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు జద్దు కృష్ణ, అంపిలి గణపతిరావు, జద్దు చిన్నంనాయుడు, బెజ్జిపురం స్వామినాయుడు, ఏవో ఇంద్ర ఆధ్వర్యంలో పంపిణీ చేపట్టారు. అగ్రికల్చర్ అసిస్టెంట్ ప్రియాంక, వారాడ రాంబాబు, టంకాల గోవిందరావు, మహేష్, బాలచంద్ర మౌళీశ్వరరావు, ఆంజనేయులు, రమణ, రైతులు పాల్గొన్నారు.

సందడిగా ప్రపంచ టూవీలర్ మెకానిక్స్ డే



బైక్ ర్యాలీలో పాల్గొన్న మెకానిక్స్

ఇచ్ఛాపురం: ప్రపంచ టూవీలర్ మెకానిక్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. బుధవారం పట్టణంలో గల బైక్ మెకానిక్స్ అంతా కలిసి బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మెకానిక్స్ ఇసురు బాస్కర్‌రెడ్డి, బాలరాజు తదితరులు పాల్గొన్నారు

ముమ్మరంగా పూడికతీత

- రూపుదిద్దుకుంటున్న సాగునీటి కాలువలు
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు



గార వద్ద కాలువలో జేసీబీతో పూడిక తీత పనులు చేస్తున్న దృశ్యం



ఉపాధి నిధులతో బాగుచేస్తున్న వత్సవలస వద్ద సాగునీటి కాలువ

గార: గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సాగునీటి కాలువలు మరమ్మతులకు నోచుకోక రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల రాష్ట్రంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రావడంతో కాలువలకు మహర్దశ పట్టింది. రైతులతో కలిసి మండల టీడీపీ నాయకులు పి.కృష్ణమూర్తి, రాధాకృష్ణ రెడ్డి తదితరులు ఇటీవల ఎమ్మెల్యే గొండు శంకర్‌ను కలిసి మండలంలోని సాగునీటి కాలువ దుస్థితి వివరించారు. దీంతో ఎమ్మెల్యే స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి.. కాలువల్లో పూడిక తీత పనులు చేపట్టేలా చర్యలు తీసుకున్నారు. దీంతో గతకొద్ది రోజులుగా సాగునీటి కాలువల్లో పూడిక తీత పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. దీంతో ఆయకట్టు రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధి నిధులతో..

ఉపాధి నిధులతో బైరి లింక్ కాలువ, నారాయణపురం, వంశధార కాలువలకు అనుబంధంగా ఉండే చాలా సాగునీటి కాలువల్లో పూడికతీత పనులు చేపట్టారు. దీంతో వేలాది మంది వేతనదారులకు ఉపాధితోపాటు రైతులకు మేలు చేకూరుతోంది. కాలువల్లో పూడిక, పిచ్చి మొక్కలు తొలగింపు పనులు చేపట్టడం ద్వారా ఇప్పుడు చెరువులు, కాలువల రూపు రేఖలు మారిపోతున్నాయి. ఫలితంగా ఈ ఖరీఫ్‌కు తమ పొలాలకు పూర్తిస్థాయిలో సాగునీరు అందే అవకాశం ఉందని ఆయకట్టు రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం.. చిన్నారికి గాయాలు

ఇచ్ఛాపురం: విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఓ చిన్నా విద్యుదాఘాతానికి గురై గాయపడిన ఘటన ఇచ్ఛాపురం పట్టణ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మున్సిపాల్టీ పరిధిలోని 21వ వార్డు గొల్లవీధిలో విద్యుత్ మెయిన్ వైర్లు ఇళ్లపై నుంచి వేలాడుతూ.. చేతికి అందినంత ఎత్తులోనే ఉన్నాయి. ఈ క్రమంతో తన ఇంటి మేడపైన ఆడుకుంటున్న చిన్నారి కరగాన శ్రీవల్లికి విద్యుత్ తీగలు తగిలి పక్కకు పడిపోయింది. దీంతో ఆ చిన్నారి చేతికి, కాళ్లకు గాయాలయ్యాయి. దీన్ని గుర్తించిన కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స అందించారు. కాగా ఇక్కడి పరిస్థితి ఎన్నిసార్లు సంబంధిత అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని ఆ వీధివాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఇచ్ఛాపురం నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్‌చార్జి దాసరి రాజు సంబంధిత అధికారులతో మాట్లాడారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు జరగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.



గాయపడిన చిన్నారి శ్రీవల్లి, చేతిపై కాలిన గాయాలు

వైభవంగా కూర్మనాథుడి జయంతి



అభిషేకం చేస్తున్న అర్చకులు

గార: శ్రీకూర్మం క్షేత్రంలో శ్రీకూర్మం జయంతి ఉత్సవం బుధవారం వైభవంగా జరిగింది. ఉదయం సుప్రభాత సేవ అనంతరం స్వామి ఉత్సవమూర్తులను ఆలయ మండపంలో ప్రధాన అర్చకులు సీతారామ నరసింహాచార్యులు, ఇతక అర్చకస్వాములు ప్రత్యేక వేదిక మీద వేంచేసిన స్వామివారికి కలశ స్నపనం, తిరుమంజన సేవను నిర్వహించారు. స్వామి వారి అవతార ఘట్టాన్ని స్థానాచార్యులు, పద్మనాభాచార్యులు నిర్వహించారు. ఈవో జి.గురునాధరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి



డీఈవోకు వినతి పత్రం అందిస్తున్న దృశ్యం

గుజరాతీపేట: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలంటూ యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఈవో కె.వెంకటేశ్వరరావును బుధవారం కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. పెండింగ్‌లో ఉన్న మెడికల్ రీయింబర్స్‌మెంట్, సర్వీస్ రెగ్యులరైజేషన్ తదితర సమస్యలు పరిష్కరించాలని కోరారు. జిల్లాలో పాఠ్యపుస్తకాలు అన్ని టైటిల్స్ సకాలంలో అందజేయాలని, ప్రభుత్వం మంజూరు చేసే కిట్లను పాఠశాల పాయింట్ వద్దకు సరఫరా చేయాలన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు ఎస్.కిశోర్‌కుమార్, ఎల్.బాబురావు, బి.శ్రీరామ్మూర్తి, హెచ్.అన్నాజీరావు, జి.సురేష్, ఎల్.కోదండరామయ్య, ఆర్.త్రినాథరావు, వైకుంఠరావు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలపై దృష్టిసారించాలి



మాట్లాడుతున్న ఆపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

అరసవల్లి: మున్సిపల్ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలు దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్నాయని, వాటిని వెంటనే పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వి.సత్యనారాయణ కోరారు. బుధవారం జిల్లా పర్యటనకు వచ్చిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ ఉపాధ్యాయులను మున్సిపల్ పాఠశాలల్లో మాత్రమే సర్దుబాటు చేయాలని, ప్రభుత్వ ఉత్తర్వు 117ను రద్దు చేసి పాఠశాలలను పరిరక్షించాలని కోరారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం పట్టణంలో అన్ని మున్సిపల్ పాఠశాలల్లో సభ్యత్వ నమోదు చేపట్టారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దుప్పల శివరామ్‌ప్రసాద్, కె.సోమేశ్వరరావు, రాష్ట్ర బాధ్యులు తమ్మినేని ఆనందరావు, చలపాక రమణ, ఉరిటి రామానాథరావు, మెట్ట.నరసింగరావు, కాశీ విశ్వనాథరావు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ఆమదాలవలస: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని యూనియన్ బ్యాంకు ఆర్డీవో సింధు ప్రజలకు సూచించారు. బుధవారం పొన్నంపేట గ్రామంలో సీఎఫ్ఎల్ కో-ఆర్డినేటర్లు చిగురుపల్లి వెంకటేష్ రామారావు సమక్షంలో ఎస్సీ, ఎస్టీ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు పొదుపు ప్రాముఖ్యత తెలుసుకొని పొదుపు చేయాలన్నారు. ఫలానా బ్యాంకు నుంచి ఫోన్ చేస్తున్నామని, ఎవరైనా ఫోన్ చేసి ఏటీఎం పిన్‌కార్డు, బ్యాంకు అకౌంట్ వివరాలు అడిగితే చెప్పవద్దన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎంజేజేవై, పీఎంఎస్‌బీవై బీమా పథకాలు గూర్చి వివరించారు. కార్యక్రమంలో సీసీ రామప్పుడు, సీఎఫ్ గాయత్రీ, మాజీ ఎంపీటీసీ ఇప్పిలి సత్యం, మాజీ సర్పంచ్‌లు ఇప్పిలి కోటేశ్వరరావు, సూర్యారావు పాల్గొన్నారు.

పంట సాగు గుర్తింపు కార్డులు పొందాలి

ఆమదాలవలస: కౌలు రైతులు తప్పనిసరిగా పంట సాగు హక్కు, గుర్తింపు కార్డులను ఎఫ్‌టీసీ డీడీ ఎ.త్రినాథస్వామి అన్నారు. బుధవారం మండలంలోని దూసి గ్రామంలో కౌలు రైతులు గుర్తింపు, నమోదు కోసం నిర్వహించిన అవగాహన సదస్సుల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కౌలు రైతులు తప్పనిసరిగా పంట సాగు హక్కు ప్రతానికి దరఖాస్తు చేసుకొని గుర్తింపు కార్డులు పొందాలని సూచించారు. కౌలు రైతుల గుర్తింపు కార్డులు పొందడం ద్వారా పంట రుణాలు, ఈ పంట నమోదు, అన్నదాత సుఖీభవ, పంట నష్టపరిహారం, పంటల బీమా, పంట కొనుగోళ్లు రాయితీపై వ్యవసాయ ఉత్పత్తులైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు వంటివి పథకాలు వర్తించడం జరుగుతుందన్నారు. ఈ కార్య క్రమంలో వ్యవసాయ శాఖ ఏడీ బగ్గు రజని, టిడిపి నాయకులు తమ్మినేని అప్పలనాయుడు, రాజశేఖర్, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ తమ్మినేని అలైఖ్య, ఏఈవో రమణమూర్తి పాల్గొన్నారు.

ఘనంగా క్రైస్తవ దినోత్సవం

ఇచ్ఛాపురం: భారత క్రైస్తవ దినోత్సవం జిల్లా క్రిస్టియన్ మైనార్టీ అధ్యక్షుడు పత్తి అన్వేష్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి వేడుకలు జరిపారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చే సి ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్స్ అందజేశారు. పేదలకు దుస్తు లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్రైస్తవ మత పెద్దలు, మండల పాస్టర్లు, అన్వేష్, గోపాల్‌బాబు, వీరబాబు, ప్రభుదాస్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఇండోర్ స్టేడియం వినియోగించుకోవాలి



స్టేడియం పరిసరాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్

రణస్థలం: రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో కొండములగాంలో ఏర్పాటు చేసిన ఇండోర్ స్టేడియంను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఈఆర్) అన్నారు. బుధవారం ఇండోర్ స్టేడియంను ఆకస్మికంగా పరిశీలించారు. స్టేడియంకు వెళ్లే రహదారి అధ్వానంగా ఉండడాన్ని గుర్తించి సంబంధిత అధికారులతో మాట్లాడారు. అదేవిధంగా కొండ నీరు వెళ్లే కాలువలు ఏర్పాటు చేస్తానన్నారు. కూటమి నాయకులు వెలిచేటి సురేష్, దన్నాన సత్తిబాబు, కాయిత రమణ, దన్నాన సురేష్, దన్నాన స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు, డ్రైనేజీ మరమ్మతులకు చర్యలు



అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే శంకర్

అరసవల్లి: నియోజకవర్గంలో రోడ్లు, డ్రైన్ల మరమ్మతులకు చర్యలు చేపడు తున్నామని ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఆర్ అండ్ బీ అధికారులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గంలో అధ్వానంగా మారిన రోడ్లు, డ్రైనేజీలకు సంబంధించి చేపట్టాల్సిన పనులపై చర్చించారు. అలాగే అసం పూర్తిగా నిలిచిపోయిన రోడ్డు నిర్మాణాలపై ఆరా తీశారు. ప్రజలు రాష్ట్రంలోనే నియోజకవర్గాన్ని అగ్రస్థానంలో నిలిపేందుకు అధికారులు చిత్తశుద్ధితో పనిచే యాలని కోరారు. సమావేశంలో ఆర్ అండ్ బీ అధికారులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే ప్రజాపాలన



బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న రామ్మోహన్‌రావు

సరుబుజ్జిలి: కూటమి ప్రభుత్వంతోనే ప్రజా పరిపాలన మొదలైందని ఆమదాలవలస నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్‌చార్జి పేడాడ రామ్మోహన్‌రావు అన్నారు. బుధవారం కొత్తకోట, నక్కలపేట, గోనిపాడు గ్రామాల్లో పలువురు బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఏడు వేల రూపాయల పింఛన్‌ను సచివాలయ సిబ్బందితో పంపిణీ చేసి ఇచ్చిన మాటను నిలబెట్టుకుందన్నారు. జగన్ వలే రూ.250 పెంచుకుంటూపోలేదన్నారు. రానున్న రోజుల్లో ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమ పథకాలు అమలు చేసి చూపిస్తామన్నారు. పవన్‌కల్యాణ్ చంద్రబాబు ఆధ్వర్యంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని ఆభావాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టిడిపి, జనసేన మండల పార్టీ అధ్యక్షుడు అంబళ్ల రాంబాబు, పైడి మురళీమోహన్, గోనిపాడు సర్పంచ్ బిర్లంగి నాగేశ్వరరావు, జనసేన ప్రధాన కార్యదర్శి పేడాడ రమణ, సతివాడ రామకృష్ణ, రొట్టినాయుడు, కొత్తకోట ఉపసర్పంచ్ సింగుపురపు రామారావు, పేడాడ చ క్రధర్, గువ్వ రాజశేఖర్, భాస్కరరావు, ఢిల్లీశ్వరరావు, జన సైనికులు పాల్గొన్నారు.

కుప్పిలికి బస్సు పునరుద్ధరణ



కుప్పిలి వెళ్లే ఆర్టీసీ బస్సుతో విద్యార్థులు, కూటమి నేతలు

ఎచ్చెర్ల: కుప్పిలి గ్రామానికి బస్సు సౌకర్యాన్ని పునరుద్ధరించారు. ఈ గ్రామంలో ఉన్న మోడల్ స్కూల్‌కు మండలంలోని వివిధ గ్రామాల నుంచి విద్యార్థులు ప్రతి రోజూ ఆర్టీసీ బస్సు ద్వారానే రాకపోకలు సాగిస్తుంటారు. వేసవి సెలవులు అనంతరం గత నెల 13న పాఠశాలలు పునః ప్రారంభమైనా బస్సు పునరుద్ధరించలేదు. ఈ విషయాన్ని తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు ఇటీవల ఆర్టీసీ అధికారుల దృష్టికి విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఆర్టీసీ అధికారులు రెండు రోజుల కిందట బస్సును పునర్ధరించారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆమదాలవలస: పట్టణ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులు చేపడుతున్న నేపథ్యంలో శుక్రవారం వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏఈ సత్తారు బయ్యన్నాయుడు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వరదావారి క్వార్టర్స్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు, బీఆర్‌నగర్ గేట్ స్కూల్ పరిధిలో మధ్యాహ్నం మూడు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏఈ తెలిపారు. ఈ అంతరాయానికి విద్యుత్ వినియోగదారులంతా సహకరించాలని కోరారు.

అతిసారపై అవగాహన

లావేరు: మురపాక పీహెచ్‌సీ పరిధిలోని అదపాకలో బుధవారం అతిసార వ్యాధి నివారణపై స్థానిక వైద్య సిబ్బంది ర్యాలీలు ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెల్త్ అసిస్టెంట్ శ్యామ్ సుందర్ మాట్లాడుతూ.. కాసి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. అదే విధంగా ఆకుకూరలు, చేపలు వంటి పదార్థాలను కొంత వరకు తగ్గించాలని కోరారు. అదే విధంగా పరిసరాల పరిశుభ్రతను పాటించాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం సుజాత, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఆర్టీసీలో డ్రైవింగ్ శిక్షణ ప్రారంభం

అరసవల్లి: ఏపీఎస్ ఆర్టీసీ హెవీ డ్రైవింగ్ స్కూల్‌లో 16వ బ్యాచ్‌కు శిక్షణను శ్రీకాకుళం-1 డిపో మేనేజర్ మల్లి కార్జునరావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంస్థలో శిక్షణ పొందిన ప్రతీ ఒక్కరూ వివిధ ప్రభుత్వ శాఖల్లో డ్రైవర్లుగా నియమితులయ్యారని, ఆర్టీసీలో కూడా ఆన్ కాల్ డ్రైవర్లుగా చాలా మంది పనిచేస్తున్నారని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఏపీఎస్ ఆర్టీసీలో మాత్రమే హెవీ డ్రైవింగ్ స్కూల్ నడపడం జరుగుతోందన్నారు. రాబోయే రోజుల్లో డ్రైవర్ల కొరత ఎక్కువగా ఉంటుందని, మీ అందరి సేవలు కూడా ఎంతో అవసరమని తెలిపారు. శిక్షణలో డ్రైవింగ్‌తో పాటు మెకానికల్ వర్క్, యోగా, ప్రథమ చికిత్స, వ్యక్తిత్వ వికాసం, రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలు నేర్పించడం జరుగుతుందన్నారు.

పెన్షన్లు చెల్లించడంపై హర్షం

పొందూరు: రాష్ట్రంలో ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు, పెన్షర్లకు సకాలంలో జీతాలు చెల్లించడంపై రిటైర్డు ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అంకం దర్మారావు బుధవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం జీతాలు, పెన్షన్లు సకాలంలో వేయకుండా వేధించిందని మండిపడ్డారు. మూడు, నాగుల దశాబ్దాల పాటు సేవలందించి ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులకు సకాలంలో పెన్షన్లు వేయడమే వారిని గౌరవించడమని, ఈ ప్రభుత్వం పెన్షనర్లను గౌరవిస్తోందన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, రిటైర్డు ఉద్యోగుల అభిమానాన్ని ఈ ప్రభుత్వం చూరగొంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సకాలంలో పెన్షన్ పడేలా చూసిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు, విద్యాశాఖా మంత్రి లోకేష్‌కు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధ్యాయులకు శిక్షణ



మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

సోంపేట: ఉపాధ్యాయుని బోధనా పద్ధతిని ఒక నమూనాలో మదింపు చేయడానికే టిచ్‌టూల్‌ను అభివృద్ధి చేసినట్టు సమగ్రశిక్ష అకాడమిక్ మానిటింగ్ అధికారి గుంట లక్ష్మీనారాయణ అన్నారు. ఎంఆర్సీలో ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం చేపట్టారు. ఈ శిక్షణను ఎంఈవో ఎస్.జోరాడు పర్యవేక్షించారు.

ఘనంగా ముత్యాలమ్మ సంబరం

ఇచ్ఛాపురం: ముత్యాలమ్మ అమ్మవారి సంబరాన్ని ఘనంగా జరిపారు. 21వ వార్డుకు చెందిన ప్రజలు అమ్మవారి సంబరాన్ని ఘనంగా జరిపారు. అమ్మవారి ఘటాలు, వివిధ వేషధారణలతో ఊరేగింపు చేపట్టారు. అనంతరం అమ్మవారి గుడి వరకు ఘటాలతో వెళ్లి మొక్కులు చెల్లించారు.

రాష్ట్రంలో అరాచక పాలన

ఇచ్ఛాపురం: రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి అరాచాలు, దౌర్జన్యాలు బాగా పెరిగిపోయాయని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వంలో పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించామన్నారు. పలాసలో అర్హులైనవారి పింఛన్లు నిలిపివేయడం దారుణమని, అడిగితే దాడులకు పాల్పడడం దుర్మార్గమన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా టీడీపీ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ బోర పుష్ప, జడ్పీటీసీ ఉప్పాడ నారాయణమ్మ, నర్తు నరేంద్ర, సర్పంచ్‌లు నర్తు ప్రసాద్, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెట్లతోనే మానవ మనుగడ

అరసవల్లి: మానవ మనుగడకు చెట్లు ఆధారమని, ప్రకృతిని కాపాడేది వృక్షాలేనని జిల్లా ఉద్యానవనశాఖ సహాయ సంచాలకులు రత్నాల వెంకట వరప్రసాద్ అన్నారు. స్థానిక పురుషుల డిగ్రీ కళాశాలలో స్టార్ వాకర్స్ క్లబ్, ఇతర నడక సంఘాల వారితో కలిసి ఆయన బుధవారం మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో హరిత వనాల పెంపకానికి వివిధ అనుబంధ శాఖల సహకారాన్ని తీసుకుని చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో గేదెల ఇందిరా ప్రసాద్ పీజీ గుప్తా, రావాడ కైలాసరావు, బివి రవిశంకర్, బి.దేవీ ప్రసాద్, బొడ్డేపల్లి ప్రసాదరావు, సింహాద్రి వేణు గోపాల్, బరాటం శ్రీనివాస్, స్రవంతి, రాంబాయి, వాసంతి, లక్ష్మీ, సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పక్కనే చెత్త

ఇచ్ఛాపురం: ఈదుపురం నుంచి ధర్మపురం వెళ్లే రోడ్డుకు ఇరు వైపులా చెత్త పేరుకుపోయింది. చెత్త తొలగించక పోవడంతో దుర్వాసన వెలువడుతోందని, దీంతో ఆ రహదారి గుండా రాకపోకలు సాగించే ప్రజలు తీవ్ర ఇబ్బం దులు పడుతున్నారని గ్రామస్థులు వాపోతున్నారు. చెత్త రోడ్డుకు ఇరు పక్కల నిల్వ ఉండడం వల్ల రోగాల బారిన పడుతున్నామని, పంచాయతీ అధికారులు చెత్తలు తొలగించాలని పలువురు కోరుతున్నారు.



ఈదుపురం రోడ్డులో ఇరువైపులా పేరుకుపోయిన చెత్త